

# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

సెప్టెంబరు 2018

సంపుటి : 24 **284** సంచిక : 9




## మధురమైన తెలుగు భాషణా భూషణాన్ని మసకబారనీయవద్దు!

చీమలు దూరని చిట్టడవుల్లో కూడా తెలుగు భాష దొరబడి వినిపించేది. ప్రపంచ దేశాల్లో భారతీయులే అధికంగా ఉంటున్నారు; వారిలో తెలుగువారే గణనీయంగా ఉంటున్నారు. వారందరూ తెలుగును వ్రాయడం, చదవడం తెలియకపోయినా, చక్కగా తెలుగును మాట్లాడగలరు. వారికి ఆంధ్ర ప్రభుత్వం వాచకాల్నూ, ఉపవాచకాలనూ అందిస్తూ ప్రోత్సహిస్తే, వారింకా మాతృభాషను గుండెల్లో భద్రంగా దాచుకుంటారు.

అమెరికాలో అనేక తెలుగు సంఘాలున్నప్పటికినీ, వారు రాజకీయ నాయకుల మెప్పుల కోసమో, సినిమా వాళ్ళ గ్లామరు కోసమో తపన పడుతున్నారే తక్క తమ భాష వ్యాప్తికోసం అంతగా తపించడం లేదు. వారు బోధనాపరంగా, తెలుగు ఉపాధ్యాయులను రావించే కృషిచేస్తే వ్రాతపరంగా తెలుగు ప్రాచుర్యంలో ఉంటుంది. చదువగలిగే అవకాశం ఉంటుంది.

కొన్ని తమిళ సంఘాలు ఈ విషయంగా కృషిచేస్తున్నట్లు వింటున్నాం. తెలుగు సంఘాలవారు తమిళులు కృషి చేస్తున్నట్టుగా కృషిచేస్తున్నట్లు తోచదు. 'మనబడి' కార్యక్రమం కృషిచేస్తున్నదని విన్నాం. ఆ కృషి చాలదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణా ప్రభుత్వములిరువురూ శ్రద్ధ వహించాలి. అక్కడి తెలుగువారికి తెలుగువాచకాలు పంపాలి. తెలుగు భాషా సంఘాలు, తెలుగుభాషా వ్యాప్తికి కృషి చేయాలి. అక్కడి తెలుగువారికి భాష చక్కదనాన్ని చిక్కగా చెప్పాలి. మూడు రోజుల వేడుకల ముచ్చటగా తెలుగు సంఘాలు బాధ్యత తీరిందనుకోరాదు. తెలుగు బోధనా ప్రక్రియకు దోహదకారి కావాలి!

ఇక మన భారతదేశం విషయానికి వస్తే, హిందీ మాట్లాడే వారి తరువాత, తెలుగు మాట్లాడేవారి సంఖ్య అధికం. కానీ, ఇటీవల 2011 జనాభా లెఖ్ఖల ప్రకారం తెలుగు మాట్లాడే వారి స్థానం నాలుగోస్థానానికి పడిపోయిందంటున్నారు. 1971 సం॥ములో 8.16 శాతం ఉండగా, ఇప్పుడు 6.70 శాతానికి దిగజారిం దంటున్నారు. మరాటీ భాష మాట్లాడే వారు ఓ మెట్టు పైకెక్కారంటున్నారు. హిందీ మాట్లాడే వారి సంఖ్య మాత్రం నానాటికీ పెరిగిపోతూనే ఉందట.

భారతదేశంలో మాట్లాడే 22 షెడ్యూల్డు భాషల్లో హిందీ భాష మాట్లాడేవారి సంఖ్య పెరుగుతున్నది. గానీ ప్రాంతీయ భాషలు మాట్లాడేవారి సంఖ్య పెరగడం లేదు. ముఖ్యంగా ఆ భాషల్లో తెలుగు భాష ఉన్నది.

దేశంలో ఇంగ్లీషు ప్రభావం ఉంటుందంటున్నారు గానీ, గత దశాబ్దంతో పోలిస్తే, తెలుగుభాషాభివృద్ధి రేటు పెద్దగా పెరగలేదు. 1971సం॥ములో 1.91 కోట్లుండగా, ఇప్పుడది 2.59 కోట్లకు చేరింది.

దేశంలోని 99 నాన్ షెడ్యూల్డు భాషల్లో 17 భాషలు కనుమరుగయ్యాయి. ఆ భాషలను మాట్లాడే సంఖ్య మైనస్‌లో పడిపోయిందనే చెప్పాలి. 2011 జనాభా లెఖ్ఖల ప్రకారం దేశవ్యాప్తంగా 8.11 కోట్ల మంది ఆంధ్రప్రదేశ్‌లో 7.06 కోట్లు కాగా, కర్నాటకలో 35 లక్షలు, తమిళనాడులో 42 లక్షలు, మహారాష్ట్రలో 13 లక్షలు, ఒరిస్సాలో 6.6 లక్షలు, చత్తీస్‌ఘడ్‌లో 1.5 లక్షలు, పశ్చిమబెంగాల్‌లో 88 లక్షలు, పుదుచ్చేరిలో 74 వేలు, గుజరాత్‌లో 73 వేలు, అండమాన్ దీవుల్లో 50 వేలు, ఢిల్లీలో 25 వేల మందీ తెలుగు మాట్లాడేవారున్నట్లు తెలుస్తూన్నది. భారతదేశంలో తెలుగు మాట్లాడేవారు 3వ స్థానంలో ఉండేవారు. ఇప్పుడు 4వ స్థానంలోకి పడిపోయారు. హిందీ తరువాత అత్యధికులు మాట్లాడే తెలుగు భాషా స్థానంలో బెంగాలీ భాష వచ్చింది. తెలుగువారు తెలుగునే మాట్లాడాలనే నిబంధనను పాటిస్తే తెలుగు నాలుగవ స్థానానికి దిగజారకపోవచ్చు. మనం ఐదవతనాన్ని (పుణ్యస్త్రీ తత్వాన్ని) నిలుపుకోవచ్చు. నిలుపుకుంటారనే నా నమ్మకం.

**తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను అన్న భావన ప్రతీ తెలుగు వానికి కలగాలి. ఏ దేశమేగినా, ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవంబు అను భావన ప్రతీ తెలుగువాని మనసులోనూ దృఢంగా ఉండాలి. ఆచరణలో నిత్య సత్యతను చూపాలి! అప్పుడే తెలుగువాడివనే మననం కలుగుతుంది. తెలుగు వికసింపబడుతుంది.**

**జై తెలుగు తల్లీ! ఎనిమిది కోట్ల**
**ఆంధ్రుల కల్పవల్లీ! వర్ధిల్లు!!**
**జయము జయము నీకు!**
**జయము జయము మనకు!**



బుధజన విధేయుడు

\- గోటేటి శ్రీరామారావు


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**




# వేదజ్ఞానపరంగా వినాయకుడు

*బ్రహ్మశ్రీ కుప్పా వేంకటకృష్ణమూర్తిగారు అవధూత పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆస్థానపండితులు, 'భక్తిమాల' సంపాదకులు. అపర అగస్త్యులు, ఇంకనూ విపులీకరించాలంటే రఘువంశ కులగురువులైన వశిష్ఠులు వంటి విద్వాంసులూ, విద్వద్వొములు. **I.SERVE** సంస్థ ద్వారా వేద విజ్ఞానాన్ని పరిశోధన చేస్తున్నారు. శాస్త్రపరంగా సమస్తమూ విశదీకరించాలనెడిది వారి అభిమతంగా కనిపిస్తున్నది. తొలిగా వారు గణనాధుని విషయంగా చేసిన విశ్లేషణ నిందు పొందు పరుస్తున్నాం.*

*– 'గోటేటి'*

**గజాననం భూత గణాధి సేవితం కపిత్థ జంబూ ఫలసారభక్షణమ్ ।**
**ఉమాసుతం శోకవినాశకారణం నమామి విఘ్నేశ్వర పాద పంకజమ్ ॥**

గణపతి! వినాయకుడు! విఘ్నేశ్వరుడు! ఇలాంటి పేర్లు వినడం కాశ్మీరు నుంచి కన్యాకుమారిదాకా ఏ మనిషికీ కొత్త అనిపించదు. అతడు ఏ మతంవాడైనా సరే, అతని మనస్సుకు "ఈ దేవుణ్ణి గురించి ఎంతో కొంత నాకు తెలుసు' అన్న భావమే కలుగుతుంది. అందుకే, భారతదేశంలో ఉత్తర దక్షిణాల్లోనూ, ప్రాక్పశ్చిమాల్లోనూ, సమమైన ఆవేశంతో ప్రజలు సమావేశమై జరుపుకునే పెద్ద పండగల్లో "వినాయక చవితి" మొట్టమొదటి పండుగ.

ఇంతకూ వినాయకుడికీ, భాద్రపద శుద్ధ చవితికీ, సంబంధమేమిటి? ఆ రోజే ఆయనను అంత పెద్దగా పూజించవలసిన అవసరమేమిటి?

ఈ ప్రశ్నకు ఒక్కొక్కరూ ఒక్కొక్క సమాధానం చెబుతున్నారు.

అది ఆయన పుట్టిన రోజు. అందువల్ల ఆ రోజు ఆయనకు ముఖ్యం! – ఇదొక సమాధానం. కొంతమంది ప్రజలకు ఇది కొంతవరకు తృప్తినిచ్చింది. కానీ, క్రమంగా ప్రజలలో తార్కిక దృష్టి పెరిగినకొద్దీ, ఈ సమాధానం చాలక, వేరే సమాధానం కోసం అన్వేషణ పెరిగింది.

భాద్రపద శుద్ధం అంటే వర్ష ఋతువుకు మధ్యభాగం. అప్పటికి ఊళ్లల్లో చెట్లన్నీ బాగా కాచి, పూచి, వుంటాయి. రైతులకు పొలాల్లో నాట్లు వగైరా పనులు పూర్తయి, కొంచెం ఖాళీగా ఉంటారు. కనుక ఈ సమయంలో ప్రకృతి మనకిచ్చిన మంచి ఓషధీ పత్రాలన్నీ ఒకచోటుకు చేర్చి, తద్వారా గ్రామాల్లో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు వినాయక చవితి వ్రతాన్ని ఏర్పాటు చేసి, దాంట్లో ఏకవింశతి పత్ర పూజ, (21 రకాల ఆకులతో పూజ) ద్వారా పూజ (గరికతో పూజ) మొదలైన వన్నీ ఏర్పాటు చేశారు!– ఇది మరో సమాధానం.

దీంట్లో కొంచెం సైన్సు, కొంచెం సెంటిమెంటు, కలిసిపోయి వున్నాయి. ఇది కొంత తృప్తినిస్తోంది. కానీ, కొంత మాత్రమే! "జరిగే పూజను చూసి, మీరు మీ మేధాశక్తిని ఉపయోగించి, సమన్వయం చేస్తున్నారే గాని, ఈ పూజ ఇందుకోసమే – అని ఎక్కడైనా పాత గ్రంథాల్లో ప్రమాణవాక్యం వుందా?– అనే ప్రశ్న అలాగే మిగిలిపోయి వుంటోందిగదా – అని ప్రశ్నిస్తోంది యువహృదయం.

ఔను నిజమే! ఈ రోజుల్లో ఈ ప్రశ్న అలా మిగిలిపోయే వుంటోంది. దానికి కారణ మేమంటే, మీరన్నారే – ఆ పాత గ్రంథాలు, అంటే, వేదాలు, ఆగమాలు, పురాణాలు, వగైరాల అధ్యయనం ఈనాటి సమాజంలో లోపించి వుంది. అది లోపించటంవల్ల, పెద్దవాళ్లెవరో చెప్పినది విని, నమ్మేసి, చేసుకుపోవలసిన పరిస్థితి వచ్చింది. ఆ అధ్యయనం సమాజంలో సమృద్ధిగా వున్న రోజుల్లో, అలా కేవల విశ్వాసంమీద ఆధారపడి నడవవలసిన అవసరం వుండేది కాదు. కనుక మనం గూడా ఇప్పుడు "ఆ పాత గ్రంథాల్లో" ఏముందో స్వయంగా చూడటం నేర్చుకోవాలి,

ఈ లక్ష్యంతోనే జగద్గురువులైన శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి ఆజ్ఞవల్ల అనేకమంది పండితులు, ప్రొఫెసర్లు, సైంటిస్టులు అందరూ I-S.E.R.V.E సంస్థ ద్వారా అద్భుతమైన రీసర్చ్ చేస్తున్నారు. ఆ పరిశోధన ఫలితాలను మనం అందరం పంచుకోవాలి. ఆ అమృతాన్ని మనం అందరం అందుకోవాలి.

ఈ విషయంలో మనమేమీ మైళ్లకు మైళ్లు తవ్వకాలు చేసి, చారిత్రక సాక్ష్యాలకోసం కసరత్తులు చేయనక్కరలేదు. ప్రపంచం మొత్తంమీద అతి పురాతన సాహిత్యంగా గుర్తింపు పొందిన వేదం ఏం చెపుతోందో వింటే చాలు!
పండుగలను నిర్ణయించే సూత్రం–

**ప్రాతర్యవాణా ప్రథమా యజధ్వమ్।**
**నో రసనా మయన్తి దేవా యా అజుష్టమ్ ॥**

ఇది ఒక ఋగ్వేద మంత్రం "సూర్యుడు ఉదయించడానికిముందు తూర్పు దిక్కున ఏ నక్షత్రం ఉదయిస్తుందో, ఆ నక్షత్రానికి నంబంధించిన దేవతను ఆనాడు పూజించండి. లేదా, సూర్యాస్తమయంకాగానే ఉదయించే నక్షత్రానికి సంబంధించిన దేవతను ఆనాడు పూజించండి" అని దీనికి అర్థం.

ఇది వేదం ఇచ్చిన వైజ్ఞానిక సూత్రం. దీన్ని ఆచరణలో పెట్టాలంటే, మనకు ఏ రోజు సూర్యోదయ సూర్యాస్తమయాలకు ఆకాశంలో ఏ నక్షత్రాలు ఉదయిస్తాయో ముందే తెలియాలి. ఇది తెలియాలంటే, అపారమైన ఖగోళ విజ్ఞానం (Astronomical Knowlege) వుండాలి. ఇది మన పూర్వీకులకు ఇప్పటికన్నా సమృద్ధిగా వుంది. కాని అది చాలదు. ఉదయించిన ఆ నక్షత్రానికీ, దేవతకూ సంబంధమేమిటో తెలియాలి.

ఈ సంబంధాన్ని ఎవరు కల్పిస్తారు? ఎవరు నిర్ణయిస్తారు? ఎవరు ఆమోదిస్తారు? పురాణ కర్తలైన మతాధిపతులా? వారి అనుయూయులా? కానేకాదు. ఆ సంబంధాన్ని కేవలం ప్రకృతే నిర్ణయిస్తుంది. ఈ విషయానికి మన ప్రధాన దేవతా మూర్తులన్నీ సాక్ష్యంగా నిలబడగలవు. అయినా, ఆది పూజ్యుడైన గణపతే ఈ

విషయంలోనూ ముందు నిలబడి, మన సందేహాలను తొలగించగలడు. ఎలా గంటారా? చూడండి–

భాద్రపదశుద్ధ తదియనాడు సూర్యోదయానికి ముందు త్రికోణాకారమైన నక్షత్ర పుంజం ఒకటి ఆకాశంలో ఉదయిస్తుంది. త్రికోణం అనేది ఎప్పుడూ మాతృమూర్తి అయిన దేవికి సంకేతం. అందువల్ల, ఆ రోజు "గౌరీ వ్రత" మని ధర్మశాస్త్ర గ్రంథాలు వ్రాస్తాయి. దీన్ని ఆంధ్రులు సరిగా ఆచరించటంలేదు. కర్ణాటకులు "గౌరీహబ్బ" అనే పేరుతో చాలా శ్రద్ధగా ఆచరిస్తున్నారు 'హబ్బ' అంటే పబ్బ. పబ్బ అంటే పండుగ. "పండుగలూ, పబ్బాలు" అనే వాడుక ఇప్పటికీ తెలుగులో వుంది. తెలుగు పదారంభంలోగల ప్రకారం కన్నడంలో సామాన్యంగా హకారంగా మారుతుంది. అందువల్ల మన పబ్బే వారి హబ్బ).

## భాద్రపదశుద్ధ చవితి–

భాద్రపద శుద్ధ చవితినాడు సూర్యోదయానికి ముందు ఆకాశంలో – అడుగున చిన్న ఎలుక లాగానూ, దానిపైన పెద్ద బాన వంటి మధ్యభాగంగల ఆకారం లానూ, కనిపించే నక్షత్రాల గుంపులు రెండు ఉదయిస్తాయి. ఈ దేవతనే ఎలుక వాహనం గల లంబోదర గణపతి దేవతగా వేదాలు, పురాణాలు, నిర్ణయించాయి. అంతే కాదు, సామాన్యంగా భాద్రపద శుద్ధచవితి నాటికి హస్తా నక్షత్రం వుంటుంది. అంటే ఆనాటి చంద్రుడు హస్తానక్షత్రంలో వుంటాడు! (నిజానికి హస్తా నక్షత్రం అనేది ఒక గుంపే. ఒంటరి నక్షత్రం కాదు). హస్తం గలవాడు హస్తి. హస్తి అంటే ఏనుగు. కనుక, ఆనాటి లంబోదర దేవత హస్తి ముఖుడని వేదాలు నిర్వచించాయి. దాన్నే పురాణాలు అను వదించాయి.

తిథులు నెలకు 30 గా సాగుతూ ఉంటాయి. నక్షత్రాలు 27 మాత్రమే కనుక ఈ రెండు వృత్తాలూ సమంగా సాగవు. వాటి సమన్వయం కోసమే అధిక మాసాలు ఏర్పడ్డాయి. ఆ గణితం గోల ప్రస్తుతం మనకు వద్దు. భాద్రపద శుద్ధ చవితి నాటికి హస్తా నక్షత్రం సరిగా ఆ తిథిలో లేకపోయినా, దానికి దగ్గరలో మాత్రం ఉంటుంది. హస్తా నక్షత్రం కలసి వస్తే ఆ చవితి ప్రశస్తం అని మాత్రం ధర్మశాస్త్ర గ్రంథాలు చెపుతాయి.

మొత్తంమీద తేలిందేమిటంటే, భాద్రపదశుద్ధ చవితినాడు, సూర్యోదయ సమయానికి ఆకాశంలో ఎలుకగుంపు, బానగుంపు – నక్షత్రాలు ఉదయిస్తూ వుంటాయి. కనుక, మన అందాల బొజ్జ గణపతి, ఏనుగు తొండంతో, ఎలుక వాహనంతో, మన యిళ్లల్లోకి ప్రవేశిస్తాడు. మన మంతా ఆ స్వామిని

**తుండమునేకదంతమును తోరపు బొజ్జయు, వామహస్తమున్ ।**
**మెండుగ[మ్రోయు] గజ్జెలును, మెల్లని చూపులు, మందహాసమున్॥**
**కొండొక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల ఒజ్జవై**
**యుండెడి పార్వతీ తనయ! ఓయి గణాధిప! నీకు మ్రొక్కెదన్ ॥**

అని వేడుకుండూ వుంటాం. ఇదే వినాయకచవితి.

ఇక భాద్రపద శుద్ధ పంచమినాటి ఉదయానికి ఆకాశంలో సప్తర్షి నక్షత్రాలు ఉదయిస్తూ ఉంటాయి. (ఇది అందరికీ తెలిసిన నక్షత్రాల గుంపే.) అందువల్లే ఆ రోజు "ఋషి పంచమీ వ్రతం". దీన్ని ఆంధ్రులలో కొద్ది మందే ఆచరిస్తున్నారు. కర్ణాటకులు విస్తారంగా ఆచరిస్తున్నారు.

## పుత్రగణపతివ్రతం–

భాద్రపదశుద్ధ చవితి నుంచి 180 డిగ్రీలు అంటే 180 రోజులు, అంటే ఆరు నెలలు. గడిచే సరికి ఫాల్గుణ శుద్ధ చవితి వస్తుంది. ఆనాటికి, ఇందాకటి గణపతి నక్షత్ర సమూహం సూర్యాస్తమయం కాగానే ఉదయిస్తుంది. వేదంలో చెప్పిన సూత్రం ప్రకారం– ఆనాడు గూడా పూజ్యదేవత గణపతే. అందుకే ధర్మ శాస్త్రకారులు ఆనాడు "పుత్రగణపతి వ్రతం" అన్నారు. దాన్ని యీనాడు మనం సరిగా ఆచరించటం లేదు. అది నక్షత్రాల తప్పుకాదు, ధర్మశాస్త్రాల తప్పుకాదు, కదా!

ఈ విధంగా గణపతి రూపం గాని, గణపతి పర్వం గాని, ఎవరి సొంత కల్పనలూ కావనీ, అది ప్రకృతి యేర్పరచిన సృష్టి రహస్యమనీ, దాన్ని తపోమయ దృష్టులతో దర్శించిన మన మహర్షులు మనకు దాన్ని వ్రత రూపంలో అందించారనీ అర్థం చేసుకున్నాం.

## గణేశలీల – ఖగోళఖేల

ఇక, గణేశ జీవిత చరిత్రగా, చెప్పబడే ప్రధాన ఘట్టాలన్నీ గూడా ఖగోళంలో



నక్షత్ర లోక దృశ్యాల వర్ణనలే ననే విషయం తెలుసుకో వలసి వుంది. ఈ విషయాలను పూజ్యులైన గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు, విస్సా అప్పారావుగారు, తిరుమల రామచంద్రగారు, సురవరం ప్రతాపరెడ్డిగారు, మొదలైన పెద్దలు తమ గ్రంథాలలో చక్కగా వివరించారు. ఈ విషయంలో గొబ్బూరివారు అనేక గ్రంథాలు వ్రాసి వున్నారు. వాటిలో ఈ వివరాలు ఎక్కువగా వున్నాయి. సంగ్రహంగా ఒకటి మాత్రం చెప్పుకుందాం – నీలాపనిందలు రాకుండా వుండటం కోసం, వినాయక చవితినాడు శ్యమంతకో పాఖ్యానం వినాలని చాలా పురాణాల్లో వుంది. స్కంద పురాణంలో ఆ సందర్భంగా, ఒక సారాంశ శ్లోకం వుంది–

**సింహః ప్రసేన మవధీత్ సింహో జాంబవతా హతః ।**
**సుకుమారక మా రోదీః తవ హ్యేష శ్యమంతకః ॥**

ఈ శ్లోకాన్ని ఈ గ్రంథంలో శ్రీస్వామీజీ గూడా ఉదహరించారు. కథా పరంగా చూస్తే–

"(అడవిలో వుండే) సింహం (సత్రాజిత్తు తమ్ముడైన) ప్రసేనుడ్ని చంపింది. ఆ సింహాన్ని జాంబవంతుడు సంహరించాడు. ఓ పసివాడా! ఏడవకు, (సూర్యదేవుడి ప్రసాదంవల్ల లభించిన) ఈ శ్యమంతక మణి ఇక నీదే!" అని ఈ శ్లోకానికి అర్థం.


## ఇక ఖగోళపరంగాచూద్దాం –

భాద్రపద మనేది చాంద్రమాన మాసం. సౌరమానంలో చూస్తే అది సింహ మాసం. అంటే, సూర్యుడు సింహరాశిలో వున్నాడు. బంగారు కిరణాలను వెదజల్లే సూర్యుడే, నిత్యమూ బంగారాన్ని పండించే శ్యమంతకమణి! ప్రసేనుడంటే, ఉగ్రంగా వుండే గ్రీష్మకాలం. వాడిని సింహరాశి సంహరించింది. అంటే, గ్రీష్మకాలం పోయి సింహమాసం ప్రవేశించింది.

అదే సింహరాశిలో పంచమినాటికి సప్తర్షి మండలం ప్రవేశించబోతోంది. సప్తర్షి మండలానికి నక్షత్ర శాస్త్ర పరిభాషలో భల్లూకమని పేరు. అంటే ఎలుకబంటి అని అర్థం. పశ్చిమ దేశీయులు గూడా యీ నక్షత్ర సమూహాన్ని అదే అర్థంతో "Great bear" అని పిలుస్తారు! సింహం పంచమినాటికి భల్లూకాక్రాస్తం కాబోతోంది కనుక, ఆ విషయాన్నే జాంబవంతుడు (భల్లూకం) సింహాన్ని చంపడంగా కథలో చెప్పారు. ●



# నారికేళ సంభరితమైన కేరళలో నారికేళాలు పగిలి జలం ధారలు ధారలుగా నేలరాలింది!



వంద సంవత్సరాలుగా జలప్రళయం ఎరుగని ప్రాణులు హతాశులయ్యారు! గోడ్లూ, గోదాములు భూస్థాపితమయ్యాయ్. ఆకలి ఆక్రందనలు మిన్నుముట్టాయ్!

ఇది ప్రళయమా? విలయమా? మూకుమ్మడి ప్రాణనాశనమా? తెలియడం లేదు!అనంత సిరిసంపదలు గల అనంత పద్మనాభుడూ అక్కడే ఉన్నాడు!

భక్తజన బాంధవుడైన శబరిమల అయ్యప్ప అక్కడే కొలువై ఉన్నాడు!

గురువాయూరు కృష్ణుడూ అక్కడే ఉన్నాడు!

ఏఁవిటీ విలయం? ఎందుకు వచ్చింది? పశుపక్షి, జంతు, మానవ ప్రాణాలెందుకు ఆహుతయ్యాయి? కలి ప్రభావమా? కలియుగాంతమా?

ఈ ప్రశ్నలకు జవాబు లేదు! ఇంతటితో ఈ ప్రమాదం తీరుతుందా? సమాధానం చిక్కదు!

కనీవినీ ఎరుగని ప్రళయం! నారికేళాలు పగిలి, నేలను ముంచివేసాయ్!

నేల ఏ పాపం చేసింది? నింగి ఏ పాపం చూసింది? నోరుండీ మాట్లాడే ప్రాణీ మాట్లాడలేకపోతుంది! నోరుండి మాట్లాడలేని ప్రాణీ మూగవోయింది!

ఆ బాధ తీరేది కాదు?

ఈ కడగండ్లు మారేవి కావు!

వంద సంవత్సరాలుగా ఎరుగని కష్టం! మరో వంద సంవత్సరాల వరకూ తీరని నష్టం.

ముక్కోటి దేవతలు ఒక్కటై రావాలి! కేరళలో ఉన్న కోట్ల జనం యొక్క కన్నీళ్ళు తుడవాలి! కలియుగాంతం కాదనీ, కలి ప్రభావం కానేకాదని చెప్పాలి.

జేబుల్లో డబ్బున్నవాడూ! జాబులు చేస్తున్నవాడూ! షరాబులూ ముందుకు వచ్చి ఈ కన్నీళ్ళను తుడవాలి! మరలా కన్నీరు పెట్టకుండా పరిస్థితులను చక్కబెట్టాలి!

సర్వేజనా స్సుఖినోభవన్తు! సర్వజన మంగళకరమస్తు!

ఇది జాతీయ విపత్తుయని, భారతజాతి యావత్తూ ఒక్కటై ఆదుకోవాలి! కష్టాలు వచ్చినప్పుడు అందరూ ఒక్కటై ఆదుకోవాలి! అదే ప్రజాస్వామ్యం! అదే ప్రజాసౌమ్యం!

ప్రజా సౌమత్యం చిరకాలం వర్ధిల్లుగాక! ప్రజలందరూ చిరకాలం సర్వర్గ సౌఖ్యములందుదురు గాక! ప్రజల సంక్షేమం ప్రవర్ధిల్లుగాక! ●

*Compliments from*

**Sri Krishna Bhat**

*When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala*

**WOOD SIDE ANNEXE**

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**

**HOTEL WOODSIDE**

E.Car Street, Tirupathi. Ph : 2284464

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)

(Opposite Bus Station)

Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911

e-mail : mayurahotels@yahoo.co.in, Grams :



# ముప్పవరపు వెంకయ్యనాయుడు మనవాడు!

## రాష్ట్రపతి పీఠాన్ని అధిష్టిస్తాడు! వెంకయ్యా నీవెంత వాడవయ్యా! ఆ ఆజాను బాహువత్వానికి తగిన పదవినే పొందావు!

ఆజానుబాహుడు, అరవింద దళాయాక్షుడన్న మాట ముప్పవరపు వెంకయ్య పట్ల మురిపాల నిజమైంది. రాజకీయ రంగంలో రాణించడమనేది అందరికీ సాధ్యంకాదు.

పదునైన కత్తి ఒర లాంటిది రాజకీయం– అంతకన్నా పదునైననది ఉపరాష్ట్రపతి పదవి! రాష్ట్రపతిలా రాజసం వొలికించే పదవి కాదు. రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులకు హుందాగా సమాధానమివ్వాలి. అది వెంకయ్యకు కరతలామలకమే! స్వతంత్ర్యం సిద్ధించిన తరువాత భారత పాలనా చరిత్రలో ఉప రాష్ట్రపతి పదవి నిర్వహించిన వారెందరో రాష్ట్రపతులయ్యారు. మన వెంకయ్య కూడా రాష్ట్రపతి కాగలడనే మా విశ్వాసం! మా శుభాశీస్సులందుకో వెంకయ్యా నిన్ను రాష్ట్రపతిగా చూస్తానయ్యా.

వెంకయ్యా నీవెంత వాడవయ్యా ఎంత ఎదిగినా వొదిగే స్వభావం నీది! అందుకే పదవులన్నీ నిన్ను వెతుక్కుంటూ వస్తున్నాయ్!

అధికారం ఉన్నా, లేకపోయినా, ఒకే పార్టీకి అంకితమైన గొప్పవాడవు నీవు.

పదవుల కోసం పార్టీలు మారడం నీ ఇజంలో లేదు, ఈ ఇజం నీ నిజాయితీకి నిదర్శనం!


ఉపరాష్ట్రపతి పదవే కాదు రాష్ట్రపతి పదవిని కూడా నీవు అధిష్ఠించగలవు. ఏక గొంతుతో నిన్నందరూ రాష్ట్రపతిగా ఎన్నుకోవచ్చు. నీలం సంజీవరెడ్డి తరువాత మీపైననే తెలుగువారు ఆశలు పెట్టుకున్నారు. భవిష్యత్తులో నిజం కావించే బాధ్యత నీపై ఉన్నది. అస్తు, తథాస్తు! ●







# చిన్తారహితుడు చింతా ప్రభాకరరావు



అనుకోని అవాంతరాలు ఏర్పడినప్పుడు ఊహించని ఉపద్రవాలు సంభవించినప్పుడు 'అంతా విధి లిఖితం, విధి వక్రించింది' అని మనసును సరిపెట్టుకుంటాం! 'అది తప్పు, విధిని చెడ్డ సమయాల్లోనే గుర్తు చేసుకోవడం పొరపాటు. విధి అంటే విశ్వాన్నంతటినీ నడిపించే మహాశక్తి... విధి విలాసం అనేది అన్ని సమయాల్లోనూ పనిచేస్తుంటుందని గుర్తుంచుకోవాలి' అంటున్న విశాఖ వాసి చింతా ప్రభాకరరావు విధికి నిజంగానే ఒక విలాసాన్ని ఏర్పరిచారు. తూర్పు గోదావరి జిల్లా సఖినేటిపల్లి సమీపంలో 'విధి' మందిరాన్ని నిర్మించిన ఆయనతో 'నవ్య' ముచ్చటించింది!

'విధి అనేది విద్యుత్తులాంటిది. వెలిగే లైట్లు, తిరిగే ఫంకాలు, విద్యుత్తుకు వివిధ రూపాలు. అవి పనిచేస్తున్నప్పుడే కరెంటు ఉంది, లేకుంటే పోయింది అంటాం. అలాగే విధికి కూడా ఒక రూపం ఉంటే విధి చేసే, విచిత్రాల గురించి జనం ఆలోచిస్తారని, ఆయన్నే దేవుడిగా చేసి ఒక మందిర నిర్మాణం చేశాను' అంటున్నారు చింతా ప్రభాకరరావు. పెద్ద ప్రచారమేదీ పోటెత్తలేదు! గనుక విధికో దేవాలయం ఉన్న వింత, ఎవరి దృష్టికీ ఇంకా రాలేదు దేవాలయమంటే పెద్ద గుడీ గోపురమేం కాదు. రెండతస్థుల్లో ఉన్న తెల్లని భవనం. పైన విశ్వశక్తి ప్రకృతి మాత, విధి భగవానుల విగ్రహాలు. క్రింది భాగంలో కేవలం ప్రకృతి విగ్రహం కనిపిస్తాయి. ఆ ప్రాంగణంలోనే ఉన్న రెండు తులసి దళాలను అర్పించి దర్శనం చేసుకుని ఎనిమిది నిమిషాలు ధ్యానిస్తే చాలంటున్నారు నిర్వాహకులు. 'ఏదైనా చెడు జరిగినప్పుడే విధి కృతం అనుకుంటారెందుకు? మరుక్షణంలో ఏం జరుగుతుంతో చెప్పలేం. ఆ మాయంతా విధి విలాసమే! సృష్టి సమస్తం విధి ఆధీనమే! విధిని మించిన శక్తి ఏముంది' అన్న ఆలోచనతో ప్రభాకరరావు ఈ మందిర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



సఖినేటిపల్లి మండలం 'మోరి' గ్రామంలో పుట్టి పెరిగిన చింతా ప్రభాకరరావు ఓ మామూలు చేనేత కార్మికుడు. నేతలోనే జీవితమంతా గడిపిన అతని కుటుంబం, కొడుకు ఉపాధి కోసం విశాఖకు వలస వెళ్ళింది. అక్కడకు వెళ్ళాక తన తండ్రి నుండి సంక్రమించిన సాహిత్య వారసత్వంతో 'విధి విలాసం' అనే మాస పత్రికను ప్రారంభించారు ప్రభాకరరావు. ఆ పత్రికను నడుపుతున్నప్పుడే ఈ 'గుడి' ఆలోచన వచ్చిందాయనకు. ఆచరణలో పెట్టడానికి పదేళ్లు పట్టింది. దీనితోపాటే విధి మతాన్నీ ప్రచారం చేస్తున్నారాయన.

ఎనిమిదితో అన్నీ... విధి మతాన్ని అవలంభించాలంటే ఏం చేయాలి? 1. శరీర ఆరోగ్యం కోసం శ్రమించాలి. 2. పరస్త్రీల పట్ల సోదరీభావంతో మెలగాలి. 3. మన జీవితానికి సరిపడినంతే సంపాదించాలి. 4. సంతృప్తిని హృదయంలో నింపాలి. 5. సర్వకాల సర్వావస్థలలోనూ నీతికి నిలబడాలి.. నిందకు భయపడాలి. నిజాయితీని పాటించాలి. 6. స్వర్గాన్ని కుటుంబంలోనే సృష్టించుకోవాలి. 7. సౌమ్యతను, సౌజన్యాన్ని పొరుగువారికి పంచాలి. 8. సత్యధర్మాన్ని పాటించాలి ఈ ఎనిమిదీ విధిమత సూత్రాలు. 'వీటిని పాటిస్తున్నా కూడా 1. దుఃఖం, 2. ద్వేషం, 3. దగా, 4. దారిద్ర్యం, 5. స్వార్థపరత్వం 6. సోమరితనం, 7. సంక్షోభం, 8. క్షుద్రత్వం వంటివి మనిషి నడవడికను పరీక్షిస్తూనే ఉంటాయి. వాటిని నుంచి రక్షించేది **విధి** దేవుడే అంటున్నారు చింతా ప్రభాకరరావు. 'పగ– పగ – దగాలకు మూలమైన రజస్తమో గుణాలను అదుపు చేసుకుంటే వినయ వివేకాలతో కూడిన సద్వర్తనా సమాజాన్ని నెలకొల్ప వచ్చునేది నా నమ్మకం అంటున్నారీయన. 1. దంభం 2. దురూహ 3. దురాగ్రహం 4. దురాశ, 5. దుష్కర్మ, 6. దుర్వ్యాపారం, 7.దుర్మార్గం 8. దురలవాట్లు– ఈ ఎనిమిదింటికీ దూరంగా ఉంచుతూ మెలిగే ప్రతివారూ విధి అనుగ్రహానికి పాత్రులేనట. ఏ ప్రాంతంలో ఉన్నా ఎనిమిది రూపాయలు ముడుపు కట్టుకుంటే చాలని కూడా చెబుతున్న ఈ వ్యక్తిని 'ఇంతకీ ఈ ఎనిమిది ప్రాముఖ్యమేంటి?' అని అడిగి చూడండి. 'మొదలూ తుదీ లేని ఎనిమిది అంకె అంటే విధికి ఇష్టం. అందుకే ఎనిమిదికంత ప్రాముఖ్యం' అంటారు.

విధి మతాన్ని ప్రపంచ పరివ్యాప్తం చెయ్యాలని కంకణం కట్టుకున్న ఈ సామాన్యుడి 'కల' నెరవేరుతుందా? అంతా విధి లిఖితం కదా!

**– అరుణ పప్పు,** విశాఖపట్నం వ్యాసాధారం!

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# తెలుగు సినిమాలకు ఆస్కార్ ఆస్కారం లేదా?

ఒకసారి కొణిజేటి రోశయ్యగారు తెలుగు సినిమాలకు ఆస్కార్ అవార్డు వస్తే ఎంత బాగుంటుందో అన్నారు. వస్తుందేమో చూద్దాం. బాహుబలి ఆస్కార్ అంచనాలకు సమీపంగా వచ్చింది.

మార్చి 4, 2018 ఆదివారం సాయంత్రం 5 గంటలకు... (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 6.30 గంటలకు) లాస్ ఏంజిలెస్‌లోని హాలీవుడ్ డాల్బీ థియేటర్లో కన్నుల పండువగా ఒక వేడుక జరుగుతుంది. 10 కోట్ల మందికి పైనే ఆ వేడుకను టీవీల్లో, ఆన్‌లైన్లో చూస్తారని అంచనా. 'ఆస్కార్ అవార్డ్స్' పేరుతో అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ నిర్వహించే ఈ వేడుక కోసం సినీ అభిమానులంతా ఎంతగానో ఎదురుచూస్తుంటారు. ఈసారి జరిగే వేడుక 90వ వది. మొత్తం ఇరవైనాలుగు విభాగాల్లో అవార్డులిస్తారు. 'అన్డ్ ది అవార్డ్ గోస్ టూ...' అనే మాట తర్వాత ఎవరి పేరైతే వినిపిస్తుందో ఆ పేరు ఇంక చరిత్రలో రికార్డయిపోతుంది. మన ఇండియా తరపున ఇందులో ఎన్ని పేర్లు నమోదయ్యాయి? ఇండియన్ సినిమా ప్రస్తావన ఆస్కార్ వేడుకలో ఎన్నిసార్లొచ్చింది? మన సినిమాకు ఆస్కార్ అందుకునే ఆస్కారం లేదా?

ఆస్కార్స్‌నే 'అకాడమీ అవార్డ్స్' అని కూడా అంటారు. 1929లో మొదటిసారి ఆస్కార్ అవార్డులు ఆరంభమయ్యాయ్. ఆస్కార్స్ కేవలం హాలీవుడ్ సినిమాలకు మాత్రమే ఇస్తారు. మొదట్లో 12 క్యాటగిరీల్లో అవార్డులు ఇచ్చేవారు. ఈ తొంభై ఏళ్ళలో మూవీ మేకింగ్‌లో వచ్చిన మార్పులు మారిన టెక్నాలజీని దృష్టిలో పెట్టుకొని ఆ అవార్డుల సంఖ్యను 24కు పెంచారు. ఈ ఇరవైనాలుగులోనే వచ్చి చేరిన 'బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్' అనే క్యాటగిరీ ఇంగ్లిష్ భాషలో కాకుండా తెరకెక్కిన ఇతర ప్రపంచ భాషల సినిమాలనుకూడా తమలో కలుపుకునేందుకు ఆస్కార్ వాడికి చేర్చుకున్న ఓ అవార్డు.

## బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్

'బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్' అనే క్యాటగిరీని ఆస్కార్స్ 1956లో మొదటిసారి తీసుకొచ్చింది. ఆ తర్వాత సంవత్సరం నుంచే ఇండియన్ సినిమా ఈ క్యాటగిరీ కింద ఆస్కార్‌కు ఎంట్రీలు పంపిస్తూనే ఉంది. 1957 నుండి 2017 వరకూ మొత్తం యాభై సినిమాలను ఆస్కార్ ఎంట్రీలుగా పంపింది. ఇండియన్ సినిమా 1984 తర్వాత ఒక్క 2003లో తప్పితే క్రమం తప్పకుండా ఇండియా ఆస్కార్‌కు ఎంట్రీలను పంపుతూనే ఉంది.



## స్పీల్‌బర్గ్ దేవుడికంటే ఎక్కువ!

దర్శకుడు స్పీల్‌బర్గ్‌ను తమ ఇన్స్పిరేషన్‌గా చెప్పుకొనేవాళ్లు ఎందరో! ఆయన సినిమాలన్నీ కలిపి ఇప్పటి వరకూ ఆస్కార్ వద్ద వివిధ క్యాటగిరీలలో 112 నామినేషన్స్ దక్కించుకున్నాయి. ఇది అతిపెద్ద రికార్డ్! అలాగే అవార్డు వేదిక మీద విన్నర్స్ ఇచ్చే థ్యాంక్యూ స్పీచ్‌లో కూడా స్పీల్‌బర్గ్‌దే రికార్డు. థాంక్యూ స్పీచ్‌లలో ఆయన పేరు 43సార్లు వినిపించింది. ఈ లిస్ట్‌లో దేవుడు (19) కూడా స్పీల్‌బర్గ్‌కు చాలా దూరంలోనే ఉండిపోయాడు.

## ఆస్కార్‌కు అర్హత పొందేదెలా?

'బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్' కొన్ని హానరరీ అవార్డులను మినహాయించి, మిగతా ఆస్కార్ అవార్డులన్నీ హాలీవుడ్ సినిమాలకు ఆ సినిమాలకు పనిచేసిన వాళ్లకే ఇస్తారు. ఆస్కార్‌కు అర్హత పొందాలంటే ఒక సినిమా 40 నిమిషాలకు మించిన నిడివి ఉండాలి. లాస్ ఏంజెలెస్‌లోని ఏదో ఒక కమర్షియల్ థియేటర్లో వారం రోజులపాటు ఆ సినిమా ఆడాలి. థియేటర్లో కాకుండా నేరుగా డీవీడీల్లో ఆన్‌లైన్లో విడుదలైన సినిమాలను లెక్కలోకి తీసుకోరు.


## ఆస్కార్ ఎలా ఇస్తారు?

ఆస్కార్ అవార్డు పొందేందుకు అర్హత ఉన్న సినిమాలను నిర్మాతల నుండి ఆస్కార్ కమిటీ ఆహ్వానిస్తుంది. అలా ఏటా మూడొందలకు పైనే సినిమాలు ఆస్కార్ పరిశీలనకు వస్తాయి. కమిటీ ఈ సినిమాలను పరిశీలించి వివిధ క్యాటగిరీల్లో నామినేషన్స్ ప్రకటిస్తుంది. సాధారణంగా జనవరి నెలలో ఈ నామినేషన్స్ ప్రకటిస్తారు. ఫిబ్రవరి నెలాఖర్లో, మార్చి మొదటివారంలో విజేతలను ఆస్కార్ వేడుకల్లో ప్రకటిస్తారు. విజేతలను ఎంపిక చేయడానికి ఆస్కార్‌లో ఆరువేలకు పైనే మెంబర్స్ ఉంటారు. ఓటింగ్ ద్వారా మెంబర్స్ విజేతలను ఎంపిక చేస్తారు.

## ఆస్కార్ బిగ్ ఫైవ్

ఆస్కార్‌లో ఉన్న అన్ని క్యాటగిరీల్లోకి టాప్ ఫైవ్ అనదగ్గవి. బెస్ట్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ యాక్టర్, బెస్ట్ యాక్ట్రెస్, బెస్ట్ స్క్రీన్‌ప్లే, (ఒరిజినల్ అడాప్టెడ్) ఈ ఐదు అవార్డులను కలిపి బిగ్ ఫైవ్ అంటారు. ఇప్పటివరకూ బిగ్ ఫైవ్ అవార్డులను సొంతం చేసుకున్న సినిమాలు మూడు మాత్రమే. ఇట్ హ్యాపెండ్ వన్‌నైట్ (1934) వన్ ఫ్లూ ఓవర్ ది కుక్కూస్ నెస్ట్ (1975), ది సైలెన్స్ ఆఫ్ ది ల్యాంబ్స్' (1991). ●



# రవీంద్ర దర్శనం

భారతీయ సాహిత్యంలో కాళిదాసు తరువాత ఎన్నదగిన మహాకవి రవీంద్రనాథ ఠాకూరే అనడం అతిశయోక్తి కాదు. భారతదేశం బానిస తనవు జడత్వంలో మగ్గుతున్న రోజుల్లో భారతాత్మనూ, ఆధ్యాత్మిక వాణినీ పాశ్చాత్య దేశాల్లో చాటి, పాశ్చాత్య మేధావుల్లో ప్రబోధం కొలిపినవారిలో స్వామి వివేకానందుని తరువాత రవీంద్రనాథ్ ఠాకూరే ముఖ్యుడు. సమకాలీన ప్రపంచంలో భారతావనికి విశిష్ట గౌరవం సమకూర్చిన త్రిమూర్తులలో (రవీంద్రనాథ్ ఠాకూర్, మహాత్మాగాంధి, జవహర్‌లాల్ నెహ్రూ) రవీంద్రుడే ఆద్యుడు. 140 సంవత్సరాల క్రితం ఉదయించి, 60 సంవత్సరాల క్రితం అస్తమించిన విశ్వకవి రవీంద్రుడు కేవలం కవి మాత్రమే కాదు, చిత్రకారుడు, బహుముఖమైన విశిష్ట వ్యక్తిత్వం సంతరించుకొన్న మహనీయుడు. అంతే కాదు రెండు దేశాల జాతీయ గీతాలు (జనగణమన– భారతదేశం, 'సోనార్ బంగ్లా – బంగ్లాదేశ్) రచించిన ఖ్యాతి ప్రపంచంలో ఒక్క రవీంద్రునికే దక్కింది. వాటికి స్వరకల్పనం కూడా ఆయనే చేసారు.

రవీంద్రుని పూర్వీకులు బహు సంపన్నులు. జాగీర్దారులు. ఆయన తాతగారు ప్రిన్స్ ద్వారకనాథ ఠాకూర్ అనేక దాన ధర్మాలు చేసి ఆడంబరంగా జీవించారు. ఆయన తండ్రి దేవేంద్రనాథ ఠాకూరు మాత్రం ఆధ్యాత్మిక చింతనతో జీవితమంతా గడిపి 'మహర్షి' అనే పేరు పొందాడు.

తల్లిదండ్రులకు రవీంద్రుడు 14వ సంతానం. వీరం వంశం బ్రాహ్మణులలో 'శాండిల్య' శాఖకు చెందినవారైనా, దేవేంద్రనాథుని హయాంలో వీరు 'బ్రహ్మ సమాజం'లో చేరిపోయారు. రవీంద్రుడు కూడా కొంతకాలం బ్రహ్మ సమాజకునిగానే ఉన్నా తరువాత దానిని విడిచి పెట్టాడు. ఆ పిమ్మట ఆయన వేరే ఏ మతానికీ ఆకర్షితుడు కాలేదు.

1861లో రవీంద్రుడు జన్మించిన సమయంలో భారతదేశమంతటా ఒక నూతనోత్తేజం, నవచైతన్యం రగులుకొనడం ప్రారంభమైంది. ఆ నూతన స్ఫూర్తి వంగ రాష్ట్రంలో మూడు రంగాలలో మహోద్యమాలకు దారితీసింది. హిందూ, మతంలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాలనూ, దురాచారాలనూ ఖండించి రాజా రామ మోహనరాయ్ బ్రహ్మ సమాజాన్ని స్థాపించారు. సాంఘిక, మత సంస్కరణలకు పునాది వేశాడు. సాహిత్య రంగంలో బంకించంద్ర చటర్జీ ప్రాచీన రీతులపైన తిరుగుబాటు చేసి, కొత్త పోకడలకు శ్రీకారం చుట్టారు. రాజకీయ రంగంలో యువతరం దాస్య శృంఖలాలను త్రెంచి వేయాలనే ప్రయత్నంతోపాటు, సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం కంకణధారులైనారు. ఈ పరిస్థితులలో పుట్టి పెరిగిన రవీంద్రుడు ఈ మూడు రంగాలనూ తన ప్రతిభతో అద్వితీయంగా ప్రభావితం చేయగలిగాడు.

రవీంద్రుడు పాఠశాలలకు వెళ్ళి ఎక్కువగా చదవలేదు. డిగ్రీలు సంపాదించలేదు. ఇంటి దగ్గర అధ్యాపకుల ద్వారా అటు తరువాత స్వయం కృషితోను సంస్కృతం, ఇంగ్లీషు, జర్మన్ భాషలను అధ్యయనం చేశారు. తన పదునేడవయేట నుండీ వంగ భాషలో కవిత్వం వ్రాయడం ఆరంభించారు. తొలిదశలో పరపీడకుల పట్ల ద్వేషాన్నీ, సామాన్య ప్రజల పట్ల సానుభూతినీ ప్రతిబింబించే కవితలూ, కథలూ ఎన్నో వ్రాశారు. తన 'సాధన' పత్రికలో ముఖ్యమైన రాజకీయ సమస్యలపై రచనలను ప్రచురించేవారు. తన రచనలలో ఆయన హిందూ– ముస్లిం సమైక్యతనూ, బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై పోరాటం జరపవలసిన ఆవశ్యకతను ఉద్బోధించారు.

### కవితా తత్వం

రవీంద్రునికి ప్రపంచ ప్రఖ్యాతి నార్జించిపెట్టిన కవితా సంకలనం 'గీతాంజలి' దీనికి 1913లో నోబెల్ బహుమానం లభించింది. దేశదేశాల్లో మేధావులందరూ దీన్ని ప్రశంసించారు. యూరోపియన్ జాతికి చెందిన ఒక వ్యక్తికి నోబెల్ బహుమానం రావడం అదే మొదటిసారి కాగా, ఇంగ్లీషు భాషలో ప్రచురితమైన గీతాంజలి వేరు, అంతకు రెండేళ్ల ముందే వంగభాషలో ప్రచురితమైన గీతాంజలి వేరు. వంగభాషలో తాను రచించిన 'గీతాంజలి' గీతి మాల్య, 'నైవేద్య' 'ఖేయ' 'శిశు' మొదలైన కావ్యాల నుంచి కొన్ని గీతాలను ఏరుకొని తానే వాటిని ఇంగ్లీషులోని కనువదించి రవీంద్రుడు ఇంగ్లీషు 'గీతాంజలి' రూపొందించారు.

రవీంద్రుని చిన్నతనంలోనే ఉపనిషత్తుల ప్రభావానికి లోనైనాడు. ముఖ్యంగా 'ఈశావోస్యోపనిషత్తు'లోని–

**తదేజతి, తన్నైజతి, తద్దూరే, తద్వంతికే**
**తదంతరస్య సర్వస్య తరు సర్వస్యాస్య బాహ్యతః'**

అన్న శ్లోకం సృష్టిలో కనిపించే ద్వంద్వ స్థితిని గురించి పిన్న వయస్సులోనే ఆయన మనసులో జిజ్ఞాసను రేకెత్తించింది. ఆ జిజ్ఞాసే ఆయన కవిత్వానికి ప్రాతిపదిక అయ్యింది. తన మొదటి కవితా సంకలనానికి ఆయన వ్రాసుకొన్న పీఠికా కవిత చదివితే ఈ సంగతి స్పష్టమౌతుంది.

**'కరగి పోగోరు ధూపమ్ము పరిమళమున**
**పరిమళము ధూపమును జుట్టి పాయనీదు;**
**స్వరము లయ బద్ధమై తృప్తి వడ దలంచు,**
**లయ శమింపగ గోరు స్వరాంకమందు;**
**సృష్టి లయలు నడుమ విస్పష్ట గీత**
**సాగు ఈ నిత్యనాటక సారమేమి?**
**భావ రూపమ్ములకు మధ్య ప్రత్యాహమ్ము**
**పరుగు ఈ రాకపోకల వైనమేమి?**

రవీంద్రుని కవిత్వం చదివినప్పుడు ఆ కవి మనస్సుపై ఉపనిషత్తుల ప్రభావంతోపాటు, వైష్ణవ భక్తి తత్త్వ ప్రభావమూ, సూఫీజం ప్రభావమూ బలంగా ఉన్నట్లు మనకు అర్థమౌతుంది. అయితే వాటిని ఆయన ఆకళించుకున్న తీరువేరు; అభివ్యక్తీకరించిన తీరు వేరు. సృష్టిలో భిన్నత్వం ఉంది. – ఎన్నో రూపాలు, ఎన్నో రంగులు ఎన్నో అందాలు! కాని వాటిని సృష్టించేదీ, నడిపించేదీ విశ్వశక్తి ఒకటుంది. ఆ విశ్వశక్తే వాటన్నిటిలోనూ అంతర్భూతమై, అంతర్గతమై ఉంది. ఈ భిన్నత్వం ఒక తెరమాత్రమే. ఆ తెరచాటు తొలగించి చూడగలిగితే మనకు కనిపించేది ఏకత్వమే! ఆ ఏకాంత శక్తి ఆ నిర్గుణశక్తి భిన్న రూపాల ద్వారా, భిన్న గుణాల ద్వారా, తన్నుతాను వ్యక్తం చేసుకొంటున్నది. మానవునికి దగ్గరవుతున్నది. మానవుడు కూడా తన 'చేతన' ద్వారా భిన్నత్వాన్ని పరిశోధించి, నిజాన్ని గ్రహించి, ఆ అతీతశక్తికి చేరువవుతున్నాడు. ఈ రీతిగా ఇద్దరి మధ్యా పరస్పరమైన, అనురాగపూర్వకమైన సంబంధం ఏర్పడుతోంది. సృష్టిలో ఇద్దరూ భాగస్వాములౌతున్నారు. ఈ అతీతశక్తినే రవీంద్రుడు తన 'జీవన దేవత (Lord of Life) గా అభివర్ణించాడు. తన కవిత్వమంతటా ఆరాధించాడు. ఇంకా లోతుగా ఆలోచిస్తే, మానవుడూ, ఈశ్వరుడూ రెండు విభిన్న శక్తులు కావనీ, మానుషాంశా, ఈశ్వరాంశా రెండూ **(తరువాయి 11వ పేజీలో)**

# విజయనగర సామ్రాజ్య స్థాపకులు శ్రీశ్రీ విద్యారణ్యస్వామివారు

ఆయనే విజయనగర సామ్రాజ్య స్థాపకులు. అదే హంపీ విజయనగర సామ్రాజ్యం కాలగమనంలో కలిసినా ఇంకా ఆ విజయనగర సామ్రాజ్యపోలికలున్నాయి.

విజయనగర సామ్రాజ్యస్థాపకులు హరిహర రాయలు, బుక్క రాయలచే విశాల తెలుగు సామ్రాజ్యాన్ని స్థాపింపచేసిన గురువరేణ్యులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్యులవారు. కడపజిల్లాలోని పెన్నానదీ తీరంలో పుష్పగిరి పీఠాన్ని స్థాపించారు. వారు ఆదిశంకర భగవత్పాదుని శిష్యులు విద్యారణ్యులుగా ఖ్యాతి గొని, శృంగేరీ పీఠాన్ని అధిష్టించారు. హంపీ విజయ నగర స్రామాజ్య ప్రతిష్టాపకులువారే! హరిహర రాయులు, బుక్కరాయలు వంశంలోనివారే శ్రీకృష్ణ దేవరాయలు వారి వంశీకులనే చరిత్రకారుల విశ్వాసం!

విజయనగర రాజ వీథుల్లో రత్నాలను రాశులుగా పోసి కొలిచిన చరిత్ర ఉన్నది. శిల్ప చిత్ర కళను పోషించిన చరిత్ర ఉన్నది. సాహితీ కళా రంగాలకు కాణాచి విజయ నగరం, గురువరేణ్యులు విద్యారణ్యుల ఆశీస్సులతో విజయనగర సామ్రాజ్యం వర్ధిల్లింది. విద్యారణ్యులు శృంగేరీ పీఠంతో పుష్పగిరి మహా సంస్థాన పీఠాన్ని అభివృద్ధిపరిచారు.

పెన్నానదీ తీరంలో ఉన్న పుష్పగిరి పీఠం మహా సంస్థానంగా వర్ధిల్లింది. కొన్ని వేల ఎకరాల పంటభూమి ఈ సంస్థానానికి కేటాయింపబడింది.



శ్రీశ్రీ విద్యారణ్యులు

కాలక్రమేణా కొందరు ఈ పీఠ భూములను ఆక్రమించుకొని పీఠానికి శిస్తులు చెల్లించకుండా ఉండడం, ఒక పీఠాధిపతిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చెయ్యడం మరో పీఠాధిపతి మతిస్థిరంలేని దశలో గదిలోని నాలుగు గోడల మధ్య బంధింపబడిన తరుణంలో పీఠ పునరుద్ధరణకు పూనుకున్న ప్రభుత్వం సమీప గ్రామం చెన్నూరులో ఉండే సద్బ్రాహ్మణ వంశీ కుణ్ణి పీఠాధిపతిగా నియమించింది. ఆయనే విద్యాశంకర నృసింహ భారతీ స్వామి. ఆయనే తిరిగి ఆ పీఠ పునర్వైభవానికి కారకులయ్యారు.

నేను ఒక వివాహ మహోత్సవానికి చెన్నూరు వెళ్ళినప్పుడు వారు పరిచయ మయ్యారు. వారు టైఫాయిడ్ జ్వరం నుంచీ అప్పుడే కోలుకుంటున్నారు.

ఆయనే శ్రీమభినవోద్దండ పుష్పగిరి మహా సంస్థాన పునర్వైభవ ప్రతిష్టాపకుడు శ్రీశ్రీ అభినవోద్దండ విద్యా నృసింహ భారతీ స్వామి.

హైదరాబాదును ప్రధాన కేంద్రంగా చేసుకుని తిరుమల, శ్రీకాళహస్తి పుష్పగిరి మఠాలకు పునర్వైభవం ప్రాప్తింపచేశారు. మద్రాసులోని మఠం ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు! మద్రాసులో మా ఇల్లు కేంద్రంగా చేసుకుని ఈ మహత్కార్యాలను సాధించడంలో మాకు కొంత పుణ్యం లభించింది. ●

---

**(10వ పేజీ తరువాయి)** మానవ ప్రకృతిలోనే ఇమిడి ఉన్నాయనీ, 'అహం' అన్న స్పృహను అధిగమించి ఈశ్వరాంశను దర్శించగలిగితే దైవత్వం సిద్ధిస్తుందని ఆయన వివరించాడు. కనుకనే 'గీతాంజలి' వంటి కవితలలో మనకు, ఈశ్వరునితో మాన వుడు సాగించిన ప్రత్యక్ష సంభాషణలే వినిపిస్తాయి. మొట్టమొదటి గీతమే చూడండి.

**'ఈ అకల్ప భాండమ్ము నీ వేరి కోరి**
**వట్టి వోజేసి తిరుగ నవ్యాతినవ్య**
**జీవన మరంద పూరణోర్జిత మొనర్చి**
**తనిసి పోదువు, నన్ననంతునిగ జేసి!**

**ఈ ఘట్టమ్మును కలకాల మిటులె నీవు**
**నింపెదవు గాని, యిదియేమి నిండుకొనదు!'**

ఇందులో మానవ జీవితానికి (మరణం ద్వారా) నిత్యనూతనత్వం తీర్చి, అనంతత్వాన్ని చేకూర్చాలనే భగవానుని ప్రయత్నం సూచితమైంది.

అందుకే రవీంద్రుని 'మార్మిక కవిత్వం' (Mystic poetry) అనే పేరు వచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధం పర్యవసానంగా, భౌతిక సంపన్నత పట్ల విముఖత చెందిన పాశ్చాత్య మేధావులనూ ఈ ధోరణి విశేషంగా ఆకర్షించింది.

It is certain that no poet in Europe since the death of Gothe in 1832,` can rival Tagore in noble humanity, in unaffected greatness, in clasical beauty అని ఆనాటి నోబెల్ కమిటీ కార్యదర్శి Perhallsstrom ప్రశంసించారు.

అయితే రవీంద్రుని 'మార్మికత' సంప్రదాయ సిద్ధమైన వేదాంత ధోరణికాదు. అనుస్యూత్యమైన భారతీయ వేదాంత దృక్పథానికీ, రవీంద్రుని వేదాంత దృష్టికీ చాలా వ్యత్యాసం ఉన్నది. 'ఈ ప్రకృతీ, మన చుట్టూ ఉన్న భౌతిక వస్తు జాలమూ (సృష్టి) అంతా అసత్తు కాదు. దీనికీ ఉనికి ఉన్నది. ఇదీ 'సత్' పదార్థమే. సృష్టి స్వరూపమూ, సృష్టిలోని జీవరాసుల ఉనికిని శాసించే ప్రకృతి ధర్మాలూ, మానవుడు తన చేతన (జ్ఞానము లేక చిత్) అర్థం చేసుకోగలిగినవే! ఆ విధంగా ఆర్జించిన జ్ఞానాన్ని తిరిగి లోక శ్రేయస్సు కోసం వినియోగించే యోగమే ఆనంద స్థితి' – యిదీ స్థూలంగా రవీంద్రుని దృక్పథం. 'సృష్టి అంతా ద్వంద్వ గుణాలతో నిండుకొని ఉన్నది. అయితే ఈ ద్వంద్వ స్థితీ, వైరుధ్యమూ విధ్వంసానికి దారితీసేవి కావు. సమైక్యత, సామసర్యమే వాటి పర్యవసానం' అని ఆయన ప్రకటించారు. మనిషి ప్రకృతి 'ధర్మాలను' (Laws) అర్థం చేసుకోవాలని ఆయన కోరాడు. వైరాగ్యాన్నీ, ఐహిక సన్యాసాన్నీ ఆయన అంగీకరించలేదు. లోకానికి దూరంగా తొలగిపోయి, ముక్కు మూసుకొని కూర్చునే ధోరణిని ఆయన నిరసించాడు. ఇంద్రియాల ద్వారానే మనం ప్రకృతిని అర్థం చేసుకుని, తద్వారా 'సత్యాన్ని' దర్శించగలుగుతామని ఆయన నమ్మాడు.

**సన్న్యసించుట వలన మోక్షమురాదు!**
**ఐహికానంద సంబంధ సహస్రమందె**
**ముక్తి పరిరంభ విస్ఫూర్తి ముమ్మరించు!'**

అని స్పష్టంగా చాటాడు. భగవంతుడు సృష్టించిన యీ సృష్టిలోని సౌందర్యాన్ని నిరసించడమంటే, భగవంతుణ్ణి నిరసించడమే కదా? అనుభవించడానికి కాకపోతే భగవంతుడీ సౌందర్యాన్ని ఎందుకు సృష్టించాడు? అని ఆయన ప్రశ్న.

**(సశేషం)**




# తెలుగులోని యాభై ఆరు అక్షరాలూ వేదాక్షరాలు

## ఈ యాభై ఆరు అక్షరాలను కాపాడుకొనే బాధ్యతను ప్రతీ తెలుగువాడు తీసుకోవాలి!



తెలుగు నేర్చుకోవడానికి వందల గ్రంథాలున్నాయి. కానీ 'పెద్దబాలశిక్ష'కు మించిన గొప్ప గ్రంథం మరొకటి లేదని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయం తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ విశ్రాంత ఐటీ నిపుణులు రాచకొండ మల్లికార్జునరావు రచించిన 'ఆస్ట్రేలియా తెలుగు వాచకాలు' (తెలుగు అక్షర పరిచయం పుస్తకాలు) ఆవిష్కరణ సభ గత మార్చి 18 శుక్రవారం విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగింది. ఆవిష్కర్త ఆచార్య శివారెడ్డి మాట్లాడుతూ తెలుగు నేర్చుకోవడానికి అన్నింటికన్నా గొప్ప గ్రంథం పెద్ద బాలశిక్ష. 56 అక్షరాల సారాంశం ఒక్క పెద్ద బాలశిక్షలోనే ఉన్నది. పెద్ద బాలశిక్షను అధ్యయనం చేస్తే ఎన్నో తెలుగు విషయాలు మనకు అవగాహనకు వస్తాయి. మనకున్న యభై ఆరు తెలుగు అక్షరాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది.

రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య, రచయిత రాచకొండ మల్లికార్జునరావు, అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు, సాహితీవేత్తలు, భాషావేత్తలు, విద్యార్థులు, విశ్వవిద్యాల బోధన, బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి తెలుగువాడూ పెద్ద బాలశిక్షను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇది 56 అక్షరాల తెలుగు నిఘంటువు. ●

# నాటక కళను నిలబెట్టుకోవాలి

## మనకు ప్రాచీన వంద సంవత్సరాల చరిత్ర తెలుస్తోంది!

నాటక కళ సజీవమైనఖిజీ, యువతీ యువకులు నాటక కళ పట్ల అభిరుచితో కృషి చేసి ఆ కళను పరిరక్షించుకోవాలని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి వక్కాణించారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ గత మార్చి 26వ తేదీ శనివారం డా. నందమూరి తారకరామారావు కళామందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సురభి నట కుటుంబానికి చెందిన నిరుపమ సునేత్రికి ఈ సంవత్సరపు జె.ఎల్. నరసింహారావు యువరంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరిచారు. ఆమెకు ఐదువేల రూపాయల నగదు, ప్రశంసా పత్రం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ కళాకారులు ప్రభుత్వం వద్దకు వచ్చి యాచించడం గాక ప్రభుత్వమే కళాకారుల వద్దకు వెళ్ళి వారిని సముచితంగా గౌరవించే రోజు తెలంగాణా ప్రభుత్వంలో వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



డా॥ కె.వి. రమణాచారి అభిభాషణ!

రిజిస్ట్రార్ ఆచార్య కె. తోమాసయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ పిలుపుపైన 1961 నుంచి ఏటా ప్రపంచ రంగస్థల దినోత్సవం జరుగుతున్నదని అన్నారు. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లు వదలి నాటక ప్రదర్శన చూడమనే అంశం ఈ సభ ప్రధాన సందేశమని వక్కాణించారు. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

bd

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

## తెలుగు చిత్రం నిర్మించిన తొలి నటీమణి

# దాసరి కోటిరత్నం



అందానికి అందమూ, చందానికి చందమూ కల దాసరి కోటిరత్నం మలి చిత్రంతోనే చలనచిత్ర నిర్మాణం లోనికి అడుగుపెట్టింది. 1935 సం॥ములో కలకత్తాలోని ఆరోరా ఫిలిమ్స్ వారి స్టూడియో సహకారంతో 'సతీ అనసూయ' చిత్రాన్ని నిర్మించి, ప్రధాన భూమిక నిర్వహించింది. తొలి మహిళగా చలనచిత్ర నిర్మాణం చేబట్టిన నటీమణి దాసరి కోటి రత్నమే! ఆమె నటించిన తొలి తెలుగు చలనచిత్రం 'సతీ సక్కుబాయి',

రాజమహేంద్రవరంకు చెందిన దర్శక నిర్మాత బి.వి.రామానందంగారు 'సక్కు బాయి' చిత్రాన్ని నిర్మిస్తూ నాటక రంగంలో విశేష ఖ్యాతిని పొందిన కోటిరత్నంను 'సక్కుబాయి' పాత్రకు ఎన్నికచేసి నటింపచేశారు. అదే ఆమె చలనచిత్ర రంగ ప్రవేశం. విశేషమేమంటే సినిమాల్లో స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించేవారు. కానీ సక్కుబాయి చిత్రంలో సక్కుబాయి అత్తగా రంగస్థలంపై విశేష ప్రచారం పొందిన సూరవరపు వేంకటేశ్వర్లు గారు అత్త పాత్రను ధరించారు. కొన్ని వందల నాటక రంగ వేదికలపై ఆయన ఆ పాత్రను ధరించి ఉంటారు. మరో విశేషమేమంటే రంగస్థలంపై దాసరి కోటిరత్నం రంగస్థలమ్మీద స్త్రీల పాత్రలకన్నా పురుషుల పాత్రలనే ఎక్కువగా ధరించారు. లోహితాస్యుడు, కుశుడు, ప్రహ్లాదుడు, సత్యవంతుడు, నారదుడు, కృష్ణుడు పాత్రలను పోషించేవారు. 'కృష్ణతులాభారం' నాటకంలో కృష్ణుడుగానూ, నారదుడుగానూ నటించారనీ, ఒక ప్రదర్శనంలో కృష్ణ పాత్రను ధరించేవారనీ, మరొక నాటకంలో నారద పాత్రను ధరించేవారని చెబుతారు. స్త్రీ పురుష పాత్రలను రెండింటినీ సమాన ప్రతిభతో నటించేవారు. ఆమె ఏ పాత్రను ధరించినా ఆ పాత్రకు రసపుష్టిని కలిగించేది.


రెండు వందల నాటక ప్రదర్శనల్లో నారద పాత్రను ధరించి, రెండు వందల రజిత పతకాలను పొందిన నటీమణి, దాసరికోటిరత్నమే! ఆమె ఆ రెండు వందలపతకాల్నీ మాలగా చేసి, ఆ పాత్ర సందర్భంలో మెడలో నలంకరించు కునేవారట. ఓసారి నైజాం నవాబుగారి కోటలో 'సావిత్రి' నాటకాన్ని ప్రదర్శించి నప్పుడు దివాన్ గారు ఆ నాటకములోని సత్యవంతుడి పాత్రను చూసి, వెండి గొడ్డలి, వెండి తాడును బహుకరించారు. ఆమె నటించినంతగా ప్రతిభావంతంగా ఏ నటీమణీ నటించలేదని అంటారు. పేరుప్రఖ్యాతులను సంపాదించి, స్వంతంగా ఓ నాట్య మండలిని కూడా స్థాపించి విరివిగా నాటకాలను ప్రదర్శించిన నాటక సంస్థ యజమానురాలు కూడా దాసరి కోటిరత్నమే. పద్యపఠనం, పాట ఆలాపనం, వచనం చెప్పడంలో ఆమె ఒక ప్రత్యేక శైలిని ప్రదర్శించేవారు.

నాటకాల్లో సంపాదించిన ధనంతోనే ఆమె సినిమా నిర్మాణంలో ప్రవేశించి 'అనసూయ' చిత్రాన్ని నిర్మించారు. ఆమె నటించిన ఇతర చిత్రాలు లంకా దహనం, మోహినీ భస్మాసుర, వరవిక్రయం, పాండురంగ విఠల్, పాదుకా పట్టాభిషేకం, వరూధిని, చంద్రవంక, అగ్నిపరీక్ష మొదలైనవి.

అందం, చందం కల దాసరి కోటిరత్నం ఏ పాత్రకైనా సరే దీటుగా కనిపించేవారు. సాటిలేని మేటిగా నటనలోనూ, పద్యాలు పాటలు పాడడంలోనూ, వాచికంలోనూ అనన్య ప్రతిభను చూపించేవారు. ఆమె నాటకాలకు జనం విరగబడి వచ్చేవారంటే ప్రధాన కారణం అదే! సినిమా రంగంలో కూడా ఆనాటి నిర్మాతలు ఇలాటి ప్రతిభాశీలురైన నటీమణులనే తీసుకునేవారు. తెలుగు నటీమణులు అందచందాల రూపలావణ్యులు. ఇప్పుడలాటివారు లేకపోవడం విచారకరం. బొంబాయి నుంచీ, కేరళ నుంచీ వస్తువులను దిగుమతి చేసుకున్నట్టు స్త్రీ తారలను దిగుమతి చేసుకుంటున్నాం. ●

## నిరక్షరాస్యతా నిర్మూలనకు నడుము కట్టిన

# పాతూరి నాగభూషణం!



నిరక్షరాస్యత జాతీయ జీవనమును నిర్వీర్యం చేస్తుందనీ, జనులు అక్ష రాస్యులైతే తప్ప, జాతి పురోగతి సాధించదని భావించి ఆంధ్రదేశంలో ఉద్యమించినవారు గాడిచెర్ల హరి సర్వోత్తమరావు గారైతే దానిని బలపరచి, అహరహమూ అందు కోసమే శ్రమించినవారు పాతూరి నాగ భూషణం గారు. ఇట్టివారు లక్షమంది ఉద్భవిస్తేనే గానీ స్వతంత్ర భారతంలో నిరక్షరాస్యత నిర్మూలం కాదన్నారు ఆచార్య రంగా.

శనివారపు సుబ్బారావు, ముది గంట జగ్గన్న శాస్త్రి, పాతూరి నాగభూషణం ముగ్గురు త్రిమూర్తులలా ఓ లక్షమంది పుడితే లక్ష మంది నిశ్చల చిత్తంతో కృషి చేసిననాడే భారత ప్రజల పూర్తి అక్షరాస్యులవుతారని భావించిన రంగా గారి కలలూ ఈనాటికీనీ ఫలించలేదు.

పాతూరి నాగభూషణంగారు ఇందుకై దీక్షతో గ్రంధాలయోద్యమం చేబట్టారు. ప్రతీ పల్లెపల్లెనా, వాడవాడలా గ్రంథాలయాలు వెలయాలనెడి గ్రంథాలయోద్యమం చేబట్టారు.


మైసూరు, బరోడా సంస్థానాధిపతులు గ్రంథాలయో ద్యమానికి సహక రించినంతగా ఆంధ్రలో సహకారం అందంలేదు. అయినా పట్టుదల, ప్రజలు ఆయనకిచ్చిన బలమూ, ఆదరణా ఆయన కృషిని కొంతవరకైనా ఫలింపచేశాయ్. నిజానికి ఆంధ్రదేశంలోని గ్రంథాలయోద్యమానికి రూపశిల్పి పాతూరి నాగభూషణమే.

స్వరాజ్యము నా జన్మహక్కు అను నినాదం ఫలించాలంటే జనుల్లో అక్షరాస్యత పెంపొందాలనీ భావించి, కలకత్తా కాంగ్రెస్ సభల్లో ప్రతిపాదించి, ఓ ఉద్యమంగా లేవదీసిన వ్యక్తి బాల గంగాధర తిలక్‌గారు! లోకమాన్యతను, సంపూర్ణ అక్షరాస్యతను కాంక్షించినాడు. అందుకే ఆయన్ను లోకమాన్య బాలగంగాధర తిలక్ అంటూ ప్రజలు గౌరవించారు. దాదాబాయి నౌరోజీ, మహాత్మాగాంధీ ప్రభృతులు 'తిలక్' ఉద్యమాన్ని బలపరచడమే గాకుండా, మార్గ దర్శకం చేసుకుని, ఆ మార్గంగా పయనించారు. నిర్భంధోచిత ప్రాథమిక విద్యయే శరణ్యమన్నారు. దేశ ప్రజలను దేశభక్తులుగా, సేవాశక్తిని పెంపొందించుటకు ఇంతకన్నా వేరు మార్గం లేదనుకుని సాగారు.

పౌర గ్రంథాలయాలు, ప్రాథమిక పాఠ శాలల్నే గాకుండా, వయోజన పాఠశాలలు, గ్రంథ ప్రచురణావశ్యకతను పెంపొందింప చేయాలని తీర్మానాలు చేశారు. తీర్మానాల అమలుకు తీవ్రంగా కృషి చేశారు.

ప్రతీ గ్రామంలోనూ అందుకు తగిన విశేష కృషి జరిగింది. రాత్రి పాఠశాలల్ను కూడా నడిపారు. ఆంధ్రదేశంలో ఈ ఉద్యమాన్ని ప్రారంభించిందీ, అంకిత భావంతో కృషి చేసింది దేశభక్తాగ్రణియైన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు. తిలక్‌గారు 1906లో ప్రతిపాదిస్తే, 1908 సం॥ములోనే సిసలైన జాతీయవాదిగా ఆంధ్రలో అమలుచేశారు. జైలుశిక్ష ననుభవించి, ఉద్యమించిన వ్యక్తి తొలి వ్యక్తి ఆయనే! అందుకే ఆయన్ను 'ఆంధ్రా తిలక్' అనేవారు. జాతీయవాదిగ తెలుగువారిలో ప్రప్రథమంగా జైలుకెళ్లినది సర్వోత్తమరావుగారే!

గాడిచెర్లవారిని గ్రంథాలయోద్యమానికి ఆహ్వానించింది నాగభూషణంగారే! వారిరువురూ తండ్రీ కొడుకులుగ గ్రంథాలయోద్యమానికి కృషిచేశారు. నాగ భూషణంగారు తమ బంధువూ, పటమటలంక వాస్తవ్యులైన కొమ్మా సీతారామయ్య గారి ఆర్థిక సహాయంతో ఆంధ్ర గ్రంథాలయోద్యమ సంఘానికి స్థిరనివాస భవనము నేర్పరచి, దానికి సర్వోత్తమ రావుగారి పేరునుపెట్టి కృతజ్ఞతను చాటుకున్నారు. వయోజన విద్యా వ్యాప్తికి, అవిరళ కృషి సలిపిన భూషణంగారు చిరస్మరణీయుడు. అలాంటి అంకిత భావుకుడు మరల పుట్టలేదు. ఇటీవల వారి శతజయంతిని వారి అభిమానులు జరుపుకున్నారు. ●



# తొలి తెలుగు అభినవ కవి
# క్షేత్రయ్య

ఆంధ్రుల అదృష్టమేమోగానీ, తొలి వాగ్గేయకారులైన సంకీర్తనాచార్యులందరూ త్రిలిఙ్గ దేశ మూడు ప్రాంతాల్లోనూ అవతరించి, ఏకదేశ సాహితీ ప్రతిభను చాటారని చెప్పడానికి అన్నమాచార్యులు, క్షేత్రయ్య, రామదాసులే నిదర్శనం!!

అచ్చ తెనుగులో సంకీర్తనలు చేసిన అన్నమయ్య రాయలసీమలో తొలి పద కవితాచార్యుడు, క్షేత్రయ్య కృష్ణా జిల్లా దివి సీమకు చెందిన మొవ్వ గ్రామంలో జన్మించి మొవ్వ గోపాలునిపై సంకీర్తనరములను చేశారు. రామదాసు తెలంగాణా జిల్లాల్లో పుట్టి, రామభక్తుడై, భద్రాచలంలో శ్రీరామచంద్రుని ఆలయం నిర్మించి, సీతారామ లక్ష్మణులను ప్రతిష్టించి, రామునిపై దాశరథీ శతకమునే గాకుండా అనేక సంకీర్తనల్ను రచించారు. ఈ ముగ్గురూ మూడు ప్రాంతాల్లో జన్మించి, వసించి, వేంకటరమణ, మొవ్వగోపాల, శ్రీరామ చంద్రులను స్తుతిస్తూ, అశేష ఆంధ్రదేశమునూ దైవభక్తితో జనులను భక్తితరంగములతో పునీతుల్ని కావించారు – ఆనాటి మూడు కోట్ల తెలుగువారి అదృష్టం.

భక్తికిగానీ, ముక్తిసాధనకు గానీ తరతమ, కులమత ప్రాంత బేధాలను పొడసూపకుండా చేసిన పరమ పుణ్య పద సంకీర్తనాచార్యులీ మువ్వురూ!

త్యాగరాజులవారు. దక్షిణ తమిళనాడు తంజావూరు జిల్లాల్లోని కావేరీ తీరమున తమిళ దేశంలో జన్మించి, తెలుగులో శ్రీరామచంద్రునిపై వేలాది కీర్తనలను రచించి, యావద్భారతదేశములో కర్ణాటక సంగీత సార్వభౌముడనిపించారు.

ప్రస్తుతం క్షేత్రయ్యను గూర్చి వారి సంకీర్తనలను ముచ్చటించుకుందాం : ఆయన కీర్తనలు సంగీత స్వరపరంగానే గాకుండా నృత్యాభి నయపరంగా కీర్తి గాంచాయ్. తాను పుట్టిన మొవ్వలోని మొవ్వగోపాలునిపైననే విశేషంగా అభినయ కీర్తనల్ను వ్రాశారు. నృత్యము నెరుగనివారు సహితమూ భక్తాభివేశంతో పాడుతూ నృత్యం చేయించే సంకీర్తనలవి :

**ఎంత చక్కనివాడే, నా సామి**
**వీడెంత చక్కనివాడే – ఇతి మువ్వగోపాలుడు**
**సతతము నామదికి సంతోషము చేసెనే ॥ ఎంత ॥**
**మొలకనవ్వులవాడే – ముద్దు మాటలవాడే**
**తళుకారు చెక్కుటద్దములు వాడే –**
**తలిరాకుజిగి దెగడ – దగు మోముగలవాడే**
**తెలితమ్మిరేకు కన్నులమరువాడే ॥ ఎంత ॥**
**చిరుతప్రాయము వాడే – చెలువొందు విదియ చం**
**దురు గేరునొసలచే మెరయువాడే**
**చెరుకువిల్లునిగన్న దొరవలె నున్నాడే**
**మెరుగు చామనచాయ – మేనమరువాడే ॥ ఎంత ॥**
**పొదలు కెందామరల పెంపొందపు పదముల వాడే**
**కొదమ సింగపు నడుమ – కొమరు మరువాడే**
**మదకరి కరలమరుచేతులవాడే**
**సుదతి మువ్వగోపాలుడెంత – సొగసులవాడే॥ ఎంత ॥**

– ఎంతో సొగసైన తెలుగుపదాలు, ఎంత నుడికారపు సొంపులతో ఉన్నాయో చూడండి. ఇవన్నీ తేటతెలుగు పదాలే! ఈ పదాల్లో సుస్వర సంగీతం ఉంది, సరళ సాహిత్యం ఉంది, శృంగార స్వరూప రాగచిత్రమున్నది. రాగరచన రసజ్ఞత చొప్పించిన లయ, తాళ, స్వర జతు లున్నాయ్. మొవ్వగోపాలునితో ఆత్మ సంయోగమొనరచ్చి, పదాలను కూర్చిన లలిత శృంగార రసాత్మక కవి క్షేత్రయ్య ఒక్కడే! పద సవ్వడులతో మువ్వలు మృదుమోహనకరంగా మ్రోగేట్టు చేయ గలిగిన మోదకర, సమ్మోదకర రచన క్షేత్రయ్యదే! తాను నాయకిగా, మొవ్వ గోపాలుని నాయకునిగా భావించి, మోహావేశంతో, భక్తిపారవశ్యంతో తన్ను తాను అర్పించుకుంటూ రచనలు సాగించిన ఏకైక నృత్యాభివేశకుడైన కవి! స్వరజతులెరిగినవాడు, నాట్యఫణతులు తెలిసినవాడు, రసోల్లాసి. 'రసొవై కవిత' అన్నది ఆయన పదాల్లో స్ఫుటీకరమైనది, సుస్పష్టమైనది. రాజుల శృంగార జీవితాన్నెరింగిన క్షేత్రయ్య లోకోక్తులను, లోక సామ్యములను, అచ్చ తెనుగు పదాల్లో వాడి, జావళులకొక వినూత్న విశిష్ట, శిష్ట సౌందర్యాన్ని కూరాడు. ఆయన భాషలో, భావంతో, భక్తి వ్యక్తీకరణంలో స్పష్టతే తప్ప క్లిష్టత కనిపించదు. మాండలికం ధ్వనించదు. అంతా ఆనందమూ, ఆహ్లాదకరమైన భక్తే! పోతనగారి భక్తి పారవశ్యం, మాధుర్యం అడుగడుగునా పదము నందు పొంగి ప్రవహిస్తూంటుంది.

1600–1680 మధ్యకాలంలో జీవించిన క్షేత్రయ్య దేశ సంచారం చేస్తూ అనేకమంది రాజుల్ని సందర్శించి, తన సంకీర్తలను వినిపించారు. రఘునాధ రాయలను సందర్శించి నపుడు, క్షేత్రయ్యను ఎందుకు వచ్చినట్లు అని ప్రశ్నించగా భ్రమరములు పూతేనియలు గ్రోవిన చందాన నేను మీవద్దకు వచ్చితినంటూ పద్యం వినిపించగా, రఘునాధుడు మురిసిపోయాడనీ, అలాగే మధురనేలిన తిరుమల నాయకుణ్ణీ, తంజావూర్ రఘునాధరాయని కుమార్డు విజయ రాఘవుడు వంటి హిందూరాజుల్నే గాకుండా, గోల్కొండ సుల్తాన్ను కూడా సందర్శించి, తన పదాలతో, పద్యాలతో సంతసింప చేశారనీ, ఇలా వివిధ సందర్భాల్లో చెప్పిన పదాలు నాలుగు వేలకు దాటినా, నాలుగు వందల పదాలు మాత్రమే అందుబాటులో వున్నాయని తెలుస్తూంది.

ఇన్ని పదాలు చెప్పి, ఇంత భక్తి ప్రపత్తులతో జీవితం గడిపిన క్షేత్రయ్య పెండ్లాడలేదు, ఓ ప్రేయసి ఉండేదని, కవితా రస స్ఫూర్తి కోసం ఆమె తోడును కోరేవా. ఎక్కువగా దేశాటనమే చేసేవాడు. ఆలయాలు సందర్శించే వాడు. ఓసారి కంచిలోని వరద రాజస్వామి ఆలయంలో ఆ స్వామి సౌందర్యాన్ని చూస్తూ యోగినిద్రలో మునిగి ఉండగా, అర్చకులు చూడకుండా వరదాజుస్వామిని అక్కడ ఉయ్యాలపై పరుండబెట్టి, తలుపులు మూసుకుని వెళ్లినట్టూ మెలకువ వచ్చి చూసేసరికి ఓ దివ్య స్త్రీమూర్తి తేజోరాశిగా కనిపించి, వయ్యారపు నడకతో సాగిపోవడంతో ఆయన శృంగారరసలోలుడై కవితలల్లాడనీ, ఆయన అసలు పేరు వరదయ్య అనీ అంటారు. ●





# నటదిగ్గజరాజు ముప్పిడి జగ్గరాజు

సినిమా రంగం పుట్టినప్పట్నుంచీ తెలుగు నాటకరంగం అశేష భారతావనిలోని జనలోకాన్ని ఘనంగా ఉర్రూతలూగించింది. భావపరంగా పద్యాలను అక్షర సొంపును మ్రింగకుండా పాడేవారు కొందరైతే, దీర్ఘ హ్రస్వాక్షర, స్వర సంపుటీకృతమైన పాటలను శ్రావ్యంగా పాడేవారు కొందరు. భావాన్ని రంగరిస్తూ తాము నటిస్తున్నామని గాకుండా, తామే పాత్రలుగా మమేకమై పాత్రకు రస పుష్టిని కల్గించేవారు కొందరు. పురాణేతిహాస పరంగా వచ్చే ఈ పాత్రలను ధరించడమెంత కష్టమో, ఆనాటి పౌరులను మెప్పించడమూ అంత కష్టం. కారణం, అక్షరాస్యత కొరవడిన జనం ఉన్నప్పటికీనీ, వారు చారిత్రిక ఇతిహాస పురాణాలన్నిటినీ పుక్కిటి పుట్టినవారు.

స్త్రీ పాత్రలను ధరించడానికి స్త్రీలు ముందుకు రాని రోజులవి. కళావంత స్త్రీలున్నప్పటికీనీ, వారు మేళ నాట్యాలకూ, గొల్లభామా కార్యకలాపములకు మాత్రమే పరిమితులయ్యేవారు. నాటకాల్లో నటించడానికొచ్చేవారు కాదు.

పురుషులే స్త్రీ పాత్రలు ధరించేవారు. కొన్ని పురాణేతిహాస పాత్రలు వచ్చేసరికి, వారిలో జాణతనం కనిపించేది కాదు. ఎంత మరుగునపెట్టినా పురుషత్వం పొడసూపేది. జనాన్ని ఆకర్షించేవారు కాదు. ఇలాటి స్థితిలో స్థానం నర్సింహా రావు గారు వచ్చి స్త్రీలు కూడా నటించలేనంతగా నటించి, నాటక రంగంలోని స్త్రీ పాత్రధారణలో విశిష్టస్థానాన్ని నిలబెట్టుకున్నారు. స్త్రీలు కూడా అంత చక్కగా నటించలేరన్న ఖ్యాతి ఒక్క స్థానం వారికే దక్కింది. అయితే ఇతఃపూర్వం 'స్థానం నర్సింహారావు' గారిని మించిన 'సుందరీ సౌమ్య సుగుణమణి'గా కీర్తిగడించిన ఓ మహానట స్త్రీ పాత్రధారుడున్నాడనీ – ఇప్పటి తెలుగువారికి తెలియదు. కారణం ఆయన పందొమ్మిదవ శతాబ్దం వాడు. 1898 సం॥ములోనే రాజమండ్రిలో ధరణీప్రగడ సూరయ్యగారు నెలకొల్పిన నాటక సమాజం వారు ప్రదర్శించిన హరిశ్చంద్ర, నలదమయంతి, చింతామణి నాటకాల్లో చంద్రమతి, దమయంతి, చింతామణి పాత్రలను అపూర్వంగా నటించి, అఖిల ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకోవడమే గాకుండా, పాడిన పాటలకు కేరింతలతో పులకరింపచేసేవారు.

నడకలో, వయ్యార నయగారముల్లో, ఒడుపుల్లో, ఒద్దికలో, సొగసూ సొంపుల్లో స్త్రీ' సహితమూ అలా నటించగలదా అనిపించేది! చంద్రమతి, దమయంతి, చింతామణిలు దివినుంచి దిగివచ్చారా, జగ్గరాజు పాత్ర సోయగము ముందు బలాదూర్ అనేవారట. వారిప్రక్కన నటించిన అంబటిపూడి కోటయ్య, వారి సహాధ్యాయుడైన వింజమూరి వేంకటలక్ష్మీ నరసింహారావుగారే ఈ మాటల్ను అన్నట్టు వింటూంటే – ఆకాలంలో నేను ఉండి ఉంటే ఈ 'సుగుణ నటమణి' చూచి ఉండేవాణ్ణి కదా అనుకున్నాను.

'సుగుణమణి' అంటే గుర్తుకువచ్చింది, తొట్టతొలుత షేక్స్‌పియర్ "ట్వెల్త్ నైటు" ఆంగ్ల నాటకం ఆధారంగా తెలుగులో ప్రదర్శింపబడిన 'సుగుణమణి' నాటకంలో సుగుణ మణి పాత్రను జగ్గరాజుగారే నటించి సెహబ్బాష్ అనిపించు కున్నారు. ఆ లాస్యం ఎవరికీ సాధ్యం కాదన్నారు. పిఠాపురం రాజావారి ప్రోత్సా హంతో స్థాపింపబడిన ఈ నాటక సమాజం 'సుగుణమణి' నాటకం ప్రదర్శిద్దామని తలచి, ప్రధాన స్త్రీ (నాయిక) పాత్రకు ఎవరు సరిపోతారని తర్జన భర్జనలు పడి 'జగ్గరాజు' కన్నా ఎవరూ నటించలేరని భావించి, ఆయన్నే నిర్ణయించి, తొలి ప్రదర్శన యిచ్చారు. ఆయన అందరి అంచనాలకూ మించి నటించడమే గాకుండా, మరికొన్ని రాజావారి ప్రాపకంలోని నాటకాల్లో నాయకి పాత్రలను ధరించారు. ఆయన కీర్తి రాజమండ్రిలో విరివిగా నాటకాలనాడించే సత్యవోలు గున్నేశ్వరరావు గారి చెవులకు సోకింది. ఆయన చింతామణీ థియేటర్ ప్రదర్శించే హరిశ్చంద్ర చిత్రనళీయంలో నాటకాల్లోని నాయకీ పాత్ర లన్నిటినీ ఆయనే అపురూప లావణ్యంతో ధరించేవారు. చీర కట్టుకోవడంలోనూ, పమిటను సవ రించుకోవడంలోనూ, కులుకుతూ సిగ్గునభినయించడంలో, వయ్యారం ఒలికించ డంలో సహితమూ స్త్రీలెవరూ సాటి వచ్చేవారు కాదు. వెనుక వేలుముడివంటి సిగను చుట్టుకుని, ఒకే ఒక పువ్వును సిగలో తురుముకుని, జరీలేని సాధారణ అంచుగల తెల్లచీర కట్టుకుని, కలహకంఠుని ఇంటిలో దాసీగా పని చేయవలసిన దీనహృదయంతో, శహనరాగంలో పద్యాన్ని పాడుతూ, ఆ భావాన్ని కనువైన దుః ఖాశ్రువులను రాలుస్తూ (ఏ గ్లిసరిన్ అవసరమూ లేకుండానే) దుఃఖాన్ని అభి నయించే పతివ్రతా శిరోమణిగా 'జగ్గరాజు' గారి నటనం ప్రేక్షక జనాన్ని సహితమూ కంట తడిపెట్టించేది.

అలాగే చింతామణిగా తొలుత హొయలు, పశ్చాత్తప్తురాలైన భక్తురాలుగా మారిన తీరూ, చూచి జనులు కళ్లప్పగించి, కనురెప్ప మూయకుండా చూసేవారంటే – ఎంతటి మహానటులో అవగాహన గాకపోదు.

ఇహ విద్యాభ్యాసమంటారా – నాటకాలపైగల మక్కువతో రెండవ ఫారంతోనే ముగిసింది. అయితే నాటకాలపై ఆసక్తీ, పాటలపై అనురక్తీ ప్రాథమిక పాఠశాల విద్యలోనే పడింది. ఆరోజుల్లో దసరాలు వచ్చేసరికి బడుల్లోని ఉపాధ్యాయులు పిల్లలచే గిలకలు పట్టించి, పిల్లల ఇండ్లకు వెళ్ళేటపుడు జయీభవా, దిగ్విజయీభవా అంటూ, ఏదయా మీదయా మామీద లేదు, ఇంతసేపుంచుట, ఇది మీకు తగునా' అని పాటలను పిల్లలచేత పాడించేవారు. బాగా పాటలు పాడేవారినే ముందు వరసలో నిలబెట్టేవారు. ఆడపిల్లలకన్నా మృదువైన స్వరంతో జగ్గరాజు ఆ వయసులోనే భావయుక్తంగా, శ్రావ్యంగా పాడడం జూచి ఉపాధ్యాయులు ఏ ఇంటికి వెళ్లినా జగ్గరాజుకే ముఖ్యత్వం యిచ్చేవారు. అలా సరస్వతమ్మ కరుణతో ఆయన్ను అనుగ్రహించి, ఓ నటుడు కావడానికి పునాదులు వేసింది. ఈలాటి మరుపురాని మణిపూసల్ని తెలియబరచడానికే కంకణం బూనిన ప్రముఖాంధ్ర తెలిసినంతవరకూ తెలిపి, జేజేల్ను పలుకుతూంది. ●

## రాజఠీవిని ప్రదర్శించిన ఒకే ఒక రంగస్థల నటుడు

# యడవల్లి సూర్యనారాయణ

ఏరీ అలనాటి అలాటి రంగస్థల నటులేరీ! ఆ పద్య నాటకాలేవీ! పద్యం పాడుతూ రాజసమొలకించే నటనను ప్రదర్శించే నటు లేరీ! దేశం గొడ్డు వోయిందా? ఉన్నవారికి ప్రచారం కరు వైందా? సినీ వ్యామోహంలో పడి, ఇరవై నాలుగు గంటలూ టీవీలకే అతుక్కు పోతున్నవారికిలాటి పద్యనాటకాలున్నాయనీ, వాటిని ప్రోత్సహించాలనెడి భావన, తపన ప్రభుత్వానికి గానీ, తెలుగు సంఘాలకు ఉందా - అని అడగవలసి వస్తూంది.

రాజసంగానీ, రాగరసంగానీ వర్షిస్తూ, జనాల హర్షానికి కారణమైన పౌరాణిక నాటకాలు పరువులెత్తాయ్. వీధి నాటకాలందు కొందరూ, వేదిక నాటకాలందు కొందరూ ప్రసిద్ధులయ్యారు. అలాటివారిని గూర్చి చెప్పుకోదగ్గ దిట్ట యడవల్లి సూర్యనారాయణ.

ఈనాడు ఎన్టీరామారావును చూచి 'అహ్వో ఒహ్వో' అన్నట్టే ఆనాటి యడవల్లి సూర్యనారాయణను రంగస్థలిపై చూచి 'అహ్వో ఓహ్వో' అనడమే కాదు 'సెహబ్బాష్ యడవల్లి' నటసార్వభౌమా, నీ నటన 'నభూతో న భవిష్యతి' అనేవారు.

1888 సం॥ము నుంచీ 1939 సంవత్సరం వరకూ యడవల్లి జీవితం సాగింది. అందాయన నాటకరంగానికి వినియోగించిన కాలమే ఎక్కువ. దర్పంగల నటుడు, దర్పానికి తగ్గ నటన, పద్యోచితగల రాగాలాపానం, అలా సంభాషణలు పలుకడంలో మరొకరికి అసాధ్యం. స్థానం నర్సింహారావుగారి మాటల్లో చెప్పాలంటే 'ఆయన నాటకరంగ విహారమెంతో ఉదాత్తమైనదో అతని బాహ్య జీవితరంగమూ అంత ఉదాత్తమైనది. అది సాటి లోకమునకు ఆదర్శప్రాయమైనది' అన్నారు. ఇపుడేదో పాజిటివ్, నెగిటివ్ పాత్రలకు 'ఈయనే' ఆద్యుడు, ఘనపాటి, లెజెండ్ అంటారు. ఆనాటివారే వీటన్నిటికీ అర్హులూ, ఆద్యులూ! అందునా రంగస్థలిపై 'టేకులూ కేకులూ టెక్కులూ టెక్నిక్‌లూ లేకుండా, అవిరామంగా ప్రేక్షకుల ఎదుటగా ప్రదర్శించిన నవరసపోషణే గొప్పది. ప్రధానంగా చెప్పుకోవలసిన నటుడు యడవల్లి. ఈయన సినిమా రంగంలోనూ తన ప్రతిభాగరిమను చూపించారు.

బళ్లారి రాఘవ ఏ పాత్ర చేసినా దానికతడు ప్రాణప్రతిష్ఠ చేస్తారనీ, అతణ్ణి మించి ఆ పాత్రను నటించగల మేటి పుట్టలేదనీ, పుట్టడనీ ప్రతీతి ఉండేది. ఆయన 'రామదాసు' పాత్రను అత్యంత ప్రతిభావంతంగా నటించేవారు. అలాటి నటమేటి రాఘవ సముఖంలో, బళ్లారిలో యడవల్లి సూర్యనారాయణగారు 'భక్తరామదాసు' నాటకంలో రామదాసు  పాత్రను పోషించిన తీరూ, వాచిక ప్రతిభ, పద్యగరిమలను జూచి అబ్బురపడి, తన స్థానమునుండీ లేచిన ప్రఖ్యాత డాక్టర్ సీతారామశర్మగారు - బళ్లారి రాఘవా వినేటట్లుగా 'ఇటీజ్ హై టైమ్ ఫర్ రాఘవ టు రిటైర్', 'ఐ హోప్ దట్ రాఘవ విల్ ఆఫ్టర్ సీయంగ్ యడవల్లి యాక్టింగ్ రామదాసు' అన్నారంటే యడవల్లి నటనా ప్రతిభా విశేషం ఎంతటి గొప్పదో తెలియకపోదు. నిజానికి బళ్లారి రాఘవ గొప్పో యడవల్లి నటన గొప్పదో తెలియక పోదు. బళ్లారి రాఘవ యడవల్లి సూర్యనారాయణ లిద్దరూ మహానటులే! విశేష సాహితీ ప్రతిభగల యడవల్లి కొన్ని తావుల యందు రాఘవాచారిని మించి నటించేవారు. ఆ విగ్రహం కూడా అటువంటిదే! ఏ పాత్రకైనా ఒదిగిపోతుంది, పాత్ర స్థాయిని ఎదిగింపచేస్తుంది. అందుకే, ఆంధ్ర, తమిళ, కన్నడ ప్రాంతాల్లో ఆయన నాటకాలకంతటి విశిష్టత ఉండేది.


ఇహ 'శాకుంతలం' నాటక విషయానికి వస్తే, రచనా పరంగానే గాకుండా, ప్రదర్శనా పరంగా కూడా ఓ గొప్ప నాటకం. కందుకూరి వీరేశలింగం గారి రచన, ఆ ప్రదర్శనలో యడవల్లివారు దుష్యంతుడు. ఉప్పులూరి సంజీవరావు గారు శకుంతల, అద్దంకి శ్రీరామమూర్తి గారు కణ్వుడు. తెర ఎత్తేసరికి 'శకుంతల' మొక్కలకు నీళ్లు పోస్తూండే  సన్నివేశం, రథమెక్కి దుష్యంత మహారాజు వస్తాడు. వయ్యారంగా మొక్కలకు నీళ్లు పోసే శకుంతల లావణ్యాన్ని దుష్యంతుని పాత్రలోనున్న యడవల్లి చూస్తారు. 'అనాఘ్రాత పుష్పంకి



సలయమలూనం' అంటూ సంస్కృత పదాల్లోని తెలుగు పదాల రస మేళవింపుతో దుష్యంతుడు పలుకడం శంకరాభరణ రాగంతో మరికొన్ని రాగాలను సమ్మిళితం చేసి అతడు పాడిన తీరు, శకుంతల అత్త వారింటికి వెళ్లేటప్పుడు **కొందల మందె దెందము శకుంతల తానెపుడేగునంతయో'** అని గద్గద స్వరంతో అద్దంకి వారు అతి శ్రావ్యంగా పాడే పద్యాలూ, అతివలకుండే అత్యంత సహజ లావణ్యంతో ఉప్పులూరి సంజీవరావుగారు, యడవల్లి వారితో శృతికలుపుతూ పాడే పాటలతో రంగస్థలం 'జిల్‌జిల్' ఝుల్ ఝుల్మని పోయింది. ఆనాటి వారి ఆ పోటా పోటీ నటనలటువంటివి. రిహార్సల్ లేకుండా స్టేజీపై తమ ఉన్నత స్థితి (స్టేటస్)ను ఒకరిని మించి ఒకరు నటించేవారు. అందరికీ కరతాళ మంగళ ధ్వనులే! యడవల్లి వారు ఠీవిగా వచ్చినప్పుడల్లా ఈలలూ, కేరింతలే. పోవునపుడు ఈ పొలతి వాల్చాపులని పాడడం ప్రేక్షకులనెంత పరవశింపచేసేదో! ఆంధ్ర గీర్వాణ భాషల్లో రచింపబడిన ఆ పద్యాలను నిర్దుష్టంగా, నైపుణ్యంతో ఆలాపించడం ఆయనకే  చెల్లింది.

రత్నావళి, రామదాసు, శాకుంతల, సావిత్రి, పాదుక ఇలా ఎన్ని నాటకాల్లోనో నాయక పాత్రలను యడవల్లిగారే ధరించేవారు. సుయోధన (దుర్యోధనుని) పాత్రలో యడవల్లిగారు ప్రదర్శించిన దర్పం ఏ నటులకూ అలవడలేదు. మగసిరి రాజసిరిగల నటుడన్నారు. దుర్యోధనుడు, సత్యవంతుడు, నలుడు, అర్జునుడు, దుష్యంతుడు, శ్రీరాముని పాత్రలకు ఆయనకు ఆయనే సాటి. ఆయనకు దీటైన నటుడింత వరకూ పుట్టలేదు, ఇహ పుట్టరు కూడా!

మైలవరం జమీందారుల నాటకాల్లోనూ, ఏలూరులోని మోతే నారాయణరావు గారి నాటకాల్లోనూ, గుంటూరు తెనాలి పురవాసులు ప్రదర్శించే నాటకాల్లోనూ యడవల్లి వారు ప్రధాన పాత్రల్ను పోషించేవారు. తేదీలు దొరక్కపోతే ఆయన తేదీల కోసం వేచి ఉండేవారు. అంతటి గిరాకీ గ్లామరు గల నటుడాయనే! ఓ పోటీ 'ద్రౌపది' చిత్రంలో యడవల్లి తన అసమాన నటనను ప్రదర్శించినట్లు విన్నాం. దురదృష్టవశాత్తూ ఆయన నటించిన సినిమాల నెగటివ్‌లుగానీ, పాడిన పాటల రికార్డులుగానీ లభించకపోవడం విచారకరం. ఆ మహానటుణ్ణి పునస్మరణ చేసుకుంటున్నందుకు ఆనందిస్తున్నాం. ●



# సద్గురువు

# నరసింహ సరస్వతీ స్వామి

అది సరిగ్గా మాఘమాసం (అంటే ఫిబ్రవరి ప్రాంతం) కృష్ణ పక్షం శుక్రవారం – అనగా 15వ శతాబ్దిలోని బహుధాన్య సంవత్సరంలో ఉత్తరాయణ పుణ్యకాల శుభఘడియల్లో ఓ మహానుభావుడు, దత్తావతారాంశుడు శ్రీశైల సన్నిధిని ప్రవహించే కృష్ణానదిలో పుష్పాసనమీద ఉపవిష్టుడై, ప్రవాహంతో బాటు శిష్యులకు వీడ్కోలు చెబుతూ వెళ్లిపోయారు. తాను అదృశ్యం కాగానే నాలుగు పువ్వులు మీ నలుగురు దరికీ ఎదురుగా ప్రవహించి వస్తాయ్. నేనెపుడూ మీ నలుగురి వద్దనే ఉంటాను. చింతించకండి – అన్నారా నారింజవర్ణ వస్త్రాలను ధరించిన ఆ ఋషివరేణ్యుడు.

ఆయనెవరో కాదు, ఆయనే నృసింహ సరస్వతి స్వామి. దత్తావతారంలో రెండవ అవతారమైన దత్తావతారమే శ్రీ నరసింహ సరస్వతీ స్వామివారు. శ్రీ గురుచరిత్ర చదివిన వారికి నరసింహ సరస్వతీ స్వాములవారిని గురించి వివరంగా విదితమవుతుంది. వారి మహిమలు అనన్య సామాన్యమైనవి.

1378 సం॥ము కరంజ నగరంలో శివభక్తి పరాయణులైన మాధవశర్మ, అంబభవానీ దంపతుల పుత్రరత్నంగా శ్రీ స్వామివారు ఉదయించారు. ఆ దంపతులు పదహారు సంవత్సరాలపాటు శని ప్రదోష పూజలు చేసిన అనంతరం పుత్రోదయం కల్గింది. శుక్ల పక్ష శశాంకునిలా పెరిగి ఏడు సంవత్సరములు వయసు వచ్చిననూ ఆ బిడ్డకు మాటలు రాకపోవడం తల్లిదండ్రులను విషాదంలో ముంచింది. సంతోషం నీళ్లుగారింది. కారుమేఘాల్లో మెరుపు మెరిసినట్లు వారికో ఆలోచన కల్గి, పుత్రునికి ఉపనయనం చేసిన మాటలు వస్తాయనెడి అభిప్రాయం కల్గింది. ఓ సుముహూర్తాన ఉపనయనం చేశారు. వారి నమ్మకం వమ్ము కాలేదు. చక్కగా మాటలు రావడమే గాకుండా గాయత్రీ శ్లోకములను చక్కగా చెప్పదొడగాడు. ఆ దంపతుల ఆనందానికి అవధుల్లేవు. ఆ ఆనందం ఎన్నో క్షణాలు నిలువలేదు. రాయి విరిగి మీదపడినట్టు–జననీ జనకులారా–నన్ను సన్యసించుటకు అనుమతి యివ్వండి, నేను దేశాటనం చేయాలనుకుంటు న్నాను అన్నారు. ఆనందం ఆవేదనగా మారింది. "కుమారా–నీకోసం పదహారు వత్సరములు ప్రదోషవ్రతం చేశాం. నీవు పుట్టావని ఎంతగానో ఆనందించాం – ఏడాది గడిచినా మాటలు రానందుకు కుమిలిపోయాం. ఏడేండ్లు ఎదురుచూచి ఉపనయనం చేసి గాయత్రోపాసనం చేయిస్తే మాటలు వస్తాయని విశ్వసించాం. ఈశ్వరానుగ్రహంతో మా విశ్వాసం ఫలించింది. నీనోట పలుకులు శ్రవణపేయంగా అందిస్తున్న క్షణంలోనే – ఏంటిటి నాయనా ఇలా మాట్లాడుతున్నావ్ – నిను విడిచి మేమెలా బ్రతకగలమయా, నీవు వివాహం చేసుకుని, తరువాత మను ధర్మానుసారం సన్యసించు నాయనా అని కోరారు.

కానీ ఆ వటువు మనసు మార్చుకోలేదు. 'అమ్మా – నీకు మరో సంతతి కలిగాక – సన్యసిస్తానన్నారు. తరువాతి సంవత్సరంలో వాళ్లకు ఇద్దరు కవల మగపిల్లలు పుట్టారు. తల్లిదండ్రులను సమ్మతింపచేసి, గృహ పరిత్యాగం చేశారు. అప్పటికా బిడ్డడి వయసు ఎనిమిది సంవత్సరములే! అలాగే కాలినడకన కాశీకి బయల్దేరి వెళ్ళాడు. ముప్పూటలా గంగలో స్నానం చేయడం, సంధ్య వార్చడం అక్కడి వారందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేయడంతో అక్కడి శృంగేరీ మఠంలోని కృష్ణ సరస్వతీ స్వామివారి చెవిని పడింది. ఆయన విద్యారణ్య సాంప్రదాయానికి చెందినవారు. ఇలాటి బాలుడును తమ సాంప్రదాయాలలో చేర్చుకుంటే సనాతన ధర్మం శోభిస్తుందని భావించి, తమ మఠానికి ఆహ్వానించారు. నరహరి స్వామి వారి ఆప్యాయతను చూచి, వారి ఆహ్వానాన్ని అంగీకరించి, వారినుంచి సన్యాసం గ్రహించి, ఆశ్రమ స్వీకారం చేశారు. కృష్ణ సరస్వతీ యతీంద్రులు నరహరికి నరసింహ సరస్వతి నామకరణం చేశారు. ఆశ్రమంలో ఉండి ఎంతమందినో వేదవిదితులైన స్వాములుగా శిక్షణ యిచ్చారు. అటుతరువాత గంగాతీర ప్రాంతాలైన బదరి, కేదారం, ప్రయాగ వంటి గంగా తీర క్షేత్రాలన్నిటినీ పర్యటించారు. ఈ పర్యటనలో ఎంతోమంది శిష్యులు ఆయన చెంత చేరారు. వారిలో ఏడుగురిని తనకూడా తీసుకుని దేశపర్యటన సాగించారు. అలా 30 సం॥ములు పర్యటించి, కరంజీనగరం చేరుకున్నారు. తల్లిదండ్రులు నరసింహ సరస్వతిని చూచి, అతని మహిమల్ని విని ఎంతగానో ఆనందించారు. తల్లికి ఆ యిద్దరు కొడుకులతో బాటు, మరో అమ్మాయి పుట్టడం కూడా ఆయనకు ఆనందహేతువైనది. కొద్ది రోజులు అక్కడనే ఉండి త్రయంబకేశ్వరం వెళ్లారు. పిన్నవయసులోనే అన్ని క్షేత్రాలను పాదాచారియై తిరిగారు. అసలు స్వామి పుట్టినప్పుడే ప్రణవముచ్చ రించడం, ఓ వింత. ఆయన కరస్పర్శచే ఇనుము బంగారంగా మారడం, వేదాలు అభ్యసించకుండానే ఆయన వేదపాఠాలను చెప్పడం, దారుణ ఉదరకోశ బాధ పడుతున్న వానికి నివారణ చేయడం, నిరుపేద బ్రాహ్మణుని దారిద్ర్యం పోగొట్టడం, ఎండిన మ్రానుని చిగురింపచేయడం, చాకలివానిని చక్రవర్తి చేయడం, అంత్యజుని నోట వేదం పలికించడం, వృద్ధ గొడ్రాలికి పుత్రో దయం కల్గించడం, కుష్ఠురోగి రోగం కుదర్చడం, కోసిన చేనులో తిరిగి సమృద్ధిగా పంటను పండింపచేయడం, ఇలా ఎన్నో మహిమలను నరసింహ సరస్వతీ స్వాములవారు చేశారు. స్వామివారిది దత్తాత్రేయుల రెండవ అవతారమనీ, మొదటి అవతారం శ్రీపాదవల్లభులనీ గురుచరిత్ర చెబుతూంది!

వారుచేసిన మహత్మ్యముల్లో మరిన్ని విషయాలున్నాయ్. గొడ్డుబర్రెనుంచీ పాలు పితికించడం, చచ్చినవాడిని బ్రతికించడం, ఒకేరోజున, ఒకే సందర్భములో ఎనిమిది గ్రామాల వారిని అనుగ్రహిస్తూ, వారికి దర్శనమిచ్చి ఆశీర్వదించడం వంటి వెన్నో, ఎన్నెన్నో!

అది 1294 సం॥ ప్రాంతం. మహమ్మదీయ రాజులు దేవగిరి రాజులను జయించి, 3 శతాబ్దాల వరకూ తమ రాజ్యాన్ని విస్తరిస్తూ వచ్చారు. మహ్మదీయ రాజుల పాలనా కాలంలో హిందూ సామ్రాజ్యం, రాజులు భారతధర్మం క్షీణిస్తూ వచ్చింది. ఆ సందర్భంలో మహారాష్ట్రలో హిందూ ధర్మ పునరుద్ధరణ నిమిత్తం, హిందూ మహమ్మదీయ ద్వేష నిర్మూలన నిమిత్తం ఎందరో మహాత్పురుషు లుదయించి ధర్మాన్ని సడలకుండా చేస్తూ వచ్చారు. పదిహేడవ శతాబ్దం వచ్చే సరికి శివాజీ మహారాజు విజృంభించారు. సమర్థ రామదాసు గురూ ఆశీర్వాదంతో హిందూ ధర్మ పునస్థాపనం జరిగింది. నరసింహ సరస్వతీ స్వామివారు అదృశ్యు లైననూ, ఆయన తన మహిమల్ని చూపుతూనే వచ్చారు. సత్పురుషులైన సాధువులు, పీఠాధీశులూ దక్షిణాదిని వెలయడానికీ, సనాతన ధర్మ పునస్థాపనకూ శ్రీ నరసింహ సరస్వతీస్వామివారినే సదా స్మరించుకోవాలి! ●

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

## దేశం పట్ల విధేయతను మొదట అలవరచుకోండి.

\- స్వామి వివేకానంద



## భారత జాతి రత్నం శ్రీ అటల్ బిహారి వాజ్‌పేయి

భారతదేశం ఏవీ మట్టి ముద్దకాదు. అది సజీవమైన ఒక జాతి ఆత్మ. భారతం ఒక పుణ్యభూమి, ఒక కర్మభూమి, భక్తి విలసిల్లే నేల. ఇక్కడి ప్రతి నదీ మాకు గంగ, ప్రతి రాయి శివలింగం. భారత్‌కోసం మేము జీవిస్తాం. భారత్‌కోసం మరణిస్తాం. మరణించిన తరువాత గంగలో కొట్టుకుపోయే మా అస్థికలను పలకరిస్తే 'భారత్‌మాతాకు జై' అనే స్వరం వినిపిస్తుంది – అంటూ లోక్‌సభలో గర్జించిన సింహం. ఒక గ్రామీణ బడిపంతులు ఇంట్లో జన్మించి దేశ ప్రధాన మంత్రి స్థాయి కెదిగిన గొప్పవాడు వాజ్‌పాయి. బాబ్రీ మసీదు విధ్వంసం జరిగి వుండకూడదు. అయోధ్యలో రాముడి కోవెల అందరి ఆకాంక్ష, ఈ విధ్వంసం వల్ల అది కొందరి ఆకాంక్ష అయ్యింది. అంటూ అదే పార్లమెంటులో తన గళం విప్పి నిర్మొహమాటంగా చెప్పిన ధీశాలి.

పాకిస్థాన్‌ను కార్గిల్ నుంచి తరిమికొట్టడంలోకాని, ప్రోక్రాన్ అణుపరీక్షా సమయంలో కాని వెనుకకు తగ్గేది లేదని తేల్చి చెప్పిన ధీరుడు.

ప్రధాని పదవిని వదలుకోడానికైనా సిద్ధపడ్డారుకాని ఎప్పుడూ వత్తిళ్ళకు లొంగలేదు. తొలుత 13 రోజుల ప్రధాన పదవిలో వున్నా ఎవరికీ తలవంచలేదు. కాంగ్రేసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పూర్తికాలం కొనసాగారు. ఆ సమయంలో కేవలం ఒకే ఒక్క ఓటులో ఓడిపోయినా మళ్లీ ఎన్నికలలో గెలిచి అన్నమాట నిలబెట్టుకున్నారు. వాజ్‌పేయి, పివి నరసింహారావుగారివి స్నేహబంధం. ఒకరంటే ఒకరికి గౌరవం. 1994లో జెనివాలో జరిగిన ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ సదస్సుకు భారతదేశ ప్రతినిధిగా వాజ్‌పాయిని పాల్గొనేటట్టుచేశారు పీవి. అప్పుడు వాజ్‌పేయి ప్రతిపక్షనేత అయినా పీవీ ఆయనను భారతదేశ బృంద నాయకుడిగా పంపించారు. అక్కడ భారత దేశం దౌత్య విజయం సాధించింది.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో వున్నాయి. దేశ రాజకీయాల్లో విలక్షణ వ్యక్తిత్వం అటల్‌జీది. భారతదేశంలోని నలుమూలలను కలుపుతూ ఆయన సృష్టించిన 'స్వర్ణ చతుర్భుజి' గోల్డెన్ క్వాడ్రి లేటరల్ ఆయన దూరదృష్టికి నిదర్శనం.

ఆయన పాలనలో వున్న ఐదేళ్లలో 32 సంస్థల ప్రైవేటీకరణ, పొక్రాన్ అణు పరీక్షలో ప్రపంచ అణుపటంలో భారత్‌కు స్థానం. భారతదేశ పరాక్రమాన్ని నిరూపించిన కార్గిల్ యుద్ధం, లాహోర్ ఒప్పందం, టెలికాం సంస్కరణలు ఇలా ఎన్నో సంస్కరణలు ఆయన చేశారు. అంతేకాదు మిత్రపక్షాల మనసు గెలిచి పాలనలో విలువలకు వన్నెలద్దిన రాజనీతిజ్ఞుడు. అంటరాని పార్టీగానూ, ఇద్దరు ఎంపీల పార్టీగాను వున్న బీజేపీని భారతదేశాన్ని ఏలే పార్టీగా మార్చిన ఘనుడు. రాజ ధర్మాన్ని ప్రబోధించిన రాజనీతిజ్ఞుడు. ఆయన మరణం తీరని లోటు. అందరి ఆమోదం పొందిన భారత జాతి రత్నం భారతరత్న అన్న మాటలను మరోసారి గుర్తు చేసుకుందాం.

నేను హిందువును, నా హిందూత్వం పరిధులు లేనిది. అత్యంత విశాలమైనది. నా హిందూత్వం హరిజనులు ఆలయంలోకి రాకుండా తలుపులు మూసెయ్యదు అన్నారు.

జీవిత ప్రయాణంలో మృత్యువు ఎప్పుడొస్తుందో తెలియదు. అందుకే దానిపై పోరాటానికి సిద్ధపడిలేను. కాని ఇప్పుడు మృత్యువుతో పోరాటం అనివార్యం మరణం నన్ను భయపెట్టాలని చూస్తోంది. అయినా పోరాడకుండా అంగీకరించను.

ఓ మృత్యువా దొంగలా రాకు, ఎదురుగా వచ్చి పోరాడు –

అంటూ తన కవిత్వంలో చెప్పినట్లు మరణంతో పోరాడి స్వర్గానికెళ్ళిపోయారు. అటల్ బిహారీ వాజ్‌పేయి. ఆయన లేని లోటు పూడ్చలేనిది. ఆయన భారతరత్న. భారతీయత కలిగిన ప్రజల హృదయంలో ఆయన ఓ జాతి రత్నం. జన హృదయంలో ఆయనది సుస్థిర స్థానం. ఆయన మాటల మొనగాడు. గెలుపు ఓటములు సమానంగా స్వీకరించగలిగిన స్థితప్రజ్ఞత కలిగినవాడు. మిత్రుడు మంచి చెలికాడు. ●

### మహానాయకుడి ప్రయాణం

**1924** గ్వాలియర్‌లో జననం
**1942** క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్టు
**1951** భారతీయ జనసంఘ్ (బీజేఎస్‌లో) చేరిక
**1957** తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల్లో విజయం
**1962** తొలిసారిగా రాజ్యసభకు ఎన్నిక
**1968** బీజేఎస్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు
**1975** అత్యయిక పరిస్థితి సమయంలో జైలు
**1977** జనతాపార్టీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు
**1980** బీజేఎస్‌ను భాజాపాగా పునర్వ్యవస్థీకరణ, తొలి అధ్యక్షుడిగా బాధ్యతలు
**1996** భారత ప్రధానిగా ప్రమాణం 13 రోజులకే పడిపోయిన ప్రభుత్వం
**1998** రెండోసారి ప్రధానిగా 13 నెలలపాటు బాధ్యతలు, పోఖ్రాన్ అణుపరీక్షల నిర్వహణ
**1999** ఢిల్లీ లాహోర్ బస్సు సేవలు ప్రారంభం. కార్గిల్ విముక్తికి ఆపరేషన్ విజయ్, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు
**2001** సర్వశిక్షా అభియాన్ ఆవిష్కరణ
**2004** పార్లమెంటు ఎన్నికల్లో భాజాపా ఓటమి
**2005** రాజకీయ సన్యాసం
**2009** చుట్టుముట్టిన పక్షవాతం
**2014** 90వ పుట్టినరోజును సుపరిపాలనా దినోత్సవంగా నిర్వహణ
**2015** భారతరత్న ప్రదానం
**2018** ఎయిమ్స్‌లో మృతి

### వాజ్‌పేయి వ్యక్తిగత వివరాలు

పూర్తిపేరు : **అటల్ బిహారీ వాజ్‌పేయి**
ముద్దు పేరు : **అటల్ జీ**
తలిదండ్రులు : **కృష్ణ బిహారీ వాజ్‌పేయి, కృష్ణాదేవి**
పుట్టిన తేది : **1924 డిసెంబరు 25**
పుట్టిన స్థలం : **గ్వాలియర్ (మధ్యప్రదేశ్)**
చదువు : **ఎం.ఏ (రాజనీతి శాస్త్రం) హిందీ, ఇంగ్లీషు, సంస్కృత భాషల్లో డిస్టింక్షన్‌లో డిగ్రీ**
రాజకీయ పార్టీ : **భారతీయ జనతా పార్టీ**
అంతకు ముందు : **రాష్ట్ర ధర్మ, పాంచజన్య, స్వదేశ్, వీర్ అర్జున్ పత్రికల్లో పాత్రికేయుడిగా పనిచేశారు.**
కుటుంబం : **పెళ్ళి చేసుకోలేదు. దత్తపుత్రిక (నమితా భట్టాచార్య) ముగ్గురు సోదరులు : అవధ్, ప్రేమ్, సుధా బిహారీ వాజ్‌పేయి**
**ముగ్గురు అక్కలు – ఊర్మిళ మిశ్రా, కమలాదేవి, విమల మిశ్రా**
అవార్డులు : **భారత రత్న (2015) ఉత్తమ పార్లమెంటేరియన్ (1994) పద్మ విభూషణ్ (1992)**

**10** లోక్‌సభకు 10 సార్లు ఎన్నిక 6 పర్యాయాలు బీజేపీ తరపున ఎంపీగా, 3 సార్లు జన్‌సంఘ్, ఒక సారి జనతాపార్టీ నుంచి విజయం
**5** లఖ్‌నవ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎన్నిక (1991–2009 మధ్య 10, 11, 12, 13, 14 వ లోక్‌సభలకు)
**4** ప్రతిపక్షంలో నాలుగు దశాబ్దాలు
**4** 4 వేర్వేరు రాష్ట్రాల నుంచి ఎన్నికైన ఏకైక పార్లమెంటేరియన్ వాజ్‌పేయే. యూపీ, ఢిల్లీ, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యారు.
**3** మూడుసార్లు ప్రధానిగా బాధ్యతలు
**2** రాజ్యసభ సభ్యునిగా రెండు పర్యాయాలు (1962, 1986)
**1** లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసారే ఓటమి. 1984లో గ్వాలియర్‌లో మాధవరావు సింధియా (కాంగ్రెస్)పై 2 లక్షల ఓట్ల తేడాతో ఓటమి.